ప్రతి అక్షరం ప్రజాహితం
RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com
నేటి ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
సంపుటి - 02 సంచిక -272 పేజీలు - 08 వెల - 04/- గురువారం 7 ఆగస్టు 2025

# 'స్త్రీశక్తి' పథకానికి శ్రీకారం

**40వేల హెయిర్ కటింగ్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్**

- నూతన బార్ పాలసీకి మంత్రివర్గం ఆమోదం
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- 'స్త్రీశక్తి' పథకానికి 15న రాష్ట్రవ్యాప్తంగా శ్రీకారం
- అరకు, భవానీ ఐలాండ్స్‌లో మరిన్ని సౌకర్యాలు
- వైష్ణవి ఇన్‌ఫ్రా కంపెనీకి 25 ఎకరాల తితిదే భూమి



**సింగపూర్‌మంత్రులను జగన్ బెదిరించారన్న చంద్రబాబు**

**కేబినేట్ సమావేశ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి**




**అమరావతి,ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:** రాష్ట్రంలో నూతన బార్ పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఏపీ సమాచార, ప్రసారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. 'స్త్రీ శక్తి' పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు పార్థసారథి వెల్లడించారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను ప్రస్తావించడంతోపాటు– తమ సింగపూర్ పర్యటనకు సంబంధించిన అంశాలను ఈ సందర్భంగా మంత్రులతో సీఎం చంద్రబాబు పంచుకున్నారు. మిగతాది 2లో...



# భారత్ పై మరో పిడుగు

**భారత దిగుమతులపై మరో 25% అదనపు సుంకం విధిస్తూ ట్రంప్ ఉత్తర్వు**

- ◆రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడమే కారణమని స్పష్టం చేసిన అమెరికా
- ◆రష్యాపై ఆంక్షలను బలపరిచేందుకే ఈ చర్యలని తెలిపిన వైట్ హౌస్
- ◆21 రోజుల తర్వాత అమల్లోకి రానున్న కొత్త టారిఫ్‌లు
- ◆ఇప్పటికే రవాణాలో ఉన్న సరుకులకు సెప్టెంబర్ 17 వరకు మినహాయింపు



2లో.

# చైనా పర్యటనకు మోదీ

**గల్వాన్ ఘర్షణ తర్వాత మొదటిసారిగా...**

- షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) సదస్సులో పాల్గొనేందుకు మోదీ చైనా పర్యటన
- ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో తియాంజిన్‌లో శిఖరాగ్ర సమావేశం
- సరిహద్దు గస్తీపై ఒప్పందం తర్వాత మెరుగైన సంబంధాలు
- ఇటీవలే చైనాలో పర్యటించిన రాజ్‌నాథ్, జైశంకర్, అజిత్ డోభాల్
- నాలుగేళ్లుగా నెలకొన్న ప్రతిష్టంభనకు తెర!



2లో.



# అమెరికా చర్యలు అన్యాయం..

**ట్రంప్ అదనపు టారిఫ్ లపై కేంద్రం స్పందన**

- ఇంధన భద్రత కోసమే రష్యా నుంచి దిగుమతులు అని వెల్లడి
- 21 రోజుల్లో అమల్లోకి రానున్న కొత్త టారిఫ్‌లు
- జాతీయ ప్రయోజనాల రక్షణకు కట్టుబడి ఉంటామని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:** భారత్ ఉత్పత్తులపై అదనపు సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. దీన్ని దురదృష్టకరమైన చర్యగా పేర్కొంది.అదనపు సుంకాల విధింపును అన్యాయం, అసమంజసమైనవిగా భారత విదేశాంగశాఖ తన ప్రకటనలో పేర్కొంది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి

# ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా జేడీ శీలం, మస్తాన్ వలి...

**ఏపీ కాంగ్రెస్‌కు ఇద్దరు**

**కొత్త వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం**

- జేడీ శీలం, మస్తాన్ వలీలకు కీలక బాధ్యతలు అప్పగింత
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆమోదంతో అధికారిక ప్రకటన
- 25 మంది సభ్యులతో పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఏర్పాటు
- కమిటీ చైర్మన్‌గా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణికం ఠాగూర్



2లో.

# హజ్ యాత్రికుల అకౌంట్లలోకి రూ.లక్ష జమ

**మంజూరైన 24 గంటల వ్యవధిలోనే చెల్లింపులు పూర్తి మైనారిటీలకు అండగా కూటమి ప్రభుత్వం**

**రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**అమరావతిఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:** విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని మొదటి ప్రాధాన్యతగా ఎన్నుకొని హజ్ యాత్ర–2025ను దిగ్విజయంగా పూర్తి చేసి వచ్చిన హజ్ యాత్రికులకు ఒక్కొక్కరికి రూ.లక్ష సాయాన్ని ప్రభుత్వం చెల్లించింది.కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 72 మందికి రూ.72 లక్షలు మంజూరు చేసిన 24 గంటల వ్యవధిలోనే నేరుగా వారి బ్యాంక్ అకౌంట్ లలోకి మొత్తాన్ని బదిలీ చేసి హామీని నిలబెట్టుకోవడం జరిగిందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ బుధవారం అమరావతి లో విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

మిగతాది 2లో...



# 42శాతం రిజర్వేషన్లు ఇస్తారా..గద్దె దింపాలా?

- బిసి రిజర్వేషన్లపై మీకెందుకు కక్ష
- తెలంగాణపై గుజరాతీల పెత్తనం ఏంది?
- మోడీపై నేరుగా విమర్శలు గుప్పించిన సిఎం రేవంత్
- ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నాల ఉద్వేగ పూరిత ప్రసంగం
- బిజెపి, బిఆర్‌ఎస్ తీరును తూర్పారా పట్టిన రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ,ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:** బీసీ రిజర్వేషన్ల బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపకపోతే.. ప్రధాని మోడీని గద్దెదించి, రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుని బీసీ రిజర్వేషన్లు సాధించుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ మెడలు వంచేందుకే ఢిల్లీలో మహాధర్నా చేపట్టామని.. కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లులకు ఆమోదం తెలకపపోతే మిగతాది 2లో...

# 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కష్టపడి పనిచేస్తున్నాం

**'సోలార్, విండ్ ఎనర్జీ టాలెంట్ హబ్ గా ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై సదస్సు**

**విజయవాడ నోవాటెల్ హెూటల్ లో కార్యక్రమం ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేశ్**

**అమరావతి ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:** మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా భవిష్యత్ లో అద్భుతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విజయవాడ నోవాటెల్ హెూటల్ లో 'సోలార్, విండ్ ఎనర్జీ టాలెంట్ హబ్ గా ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, స్వనీతి ఇనీషియేటివ్ సంయుక్తంగా నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్ కు మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మిగతాది 2లో...



# 15న స్త్రీశక్తికి శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

పర్యాటక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని.. అరకు, భవానీ ఐలాండ్స్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి చెప్పారు. రూ.900 కోట్ల ఏపీ బీడీసీఎల్ రుణాలకు ప్రభుత్వ హామీకి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. వైష్ణవి ఇన్‌ఫ్రా కంపెనీకి 25 ఎకరాల తితిదే భూమిని ఇచ్చేందుకు క్యాబినెట్ అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు. బీసీ వర్గాల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. మత్స్యకారులు, నాయీ బ్రాహ్మణులకు గౌరవ వేతనం పెంచామన్నారు. 40వేల హెయిర్ కటింగ్ షాపులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు- తెలిపారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నామని.. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కేబినెట్ మంత్రులను సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అయితే ఆగస్ట్ 15వ తేదీ.. స్వాతంత్ర దినోత్సవమని.. ఆ రోజు చాలా కార్యక్రమాలు ఉంటాయని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు మంత్రులు విన్నవించారు. కానీ టైమ్ అడ్జెట్ చేసుకుని ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని వారికి సీఎం సూచించారు. ఇక ఈ కేబినెట్ సమావేశంలో కొత్త బార్ పాలసీను ఆమోదించారు. అయితే కల్లు గీత కార్మికుల కోసం కేటాయించిన షాపుల్లో బినామీలు వస్తే సహించనని హెచ్చరించారు. ఆర్టీసీ బస్సుల్లో స్త్రీలకు ఉచిత ప్రయాణం ప్రారంభానికి ముందే.. ఆటో డ్రైవర్లను పిలిపించి వారితో మాట్లాడాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ సమావేశంలో సూచించారు. ఈ సూచనపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఆటో డ్రైవర్లను వెంటనే పిలిపించి వారితో సమావేశం ఏర్పాటు- చేయాలని అధికారులకు సీఎం ఆదేశించారు. వారితో మాట్లాడి తగిన సహాయం చేయాలని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా సూచించారు.వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ దెబ్బకు సింగపూర్ వాళ్లు ఎట్టి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు రానని చెప్పారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వారు.. అక్కడికి వెళ్లి సింగపూర్ మంత్రులను బెదిరించారని చెప్పారు. కేసులు పెడతామని బెదిరించి వాళ్లను భయపెట్టే పరిస్థితి జరిగిందని తెలిపారు. అలాగే సీడ్ క్యాపిటల్‌లో తాము భాగస్వామ్యం కాబోమని వారు స్పష్టం చేశారని పేర్కొన్నారు.

పార్టనర్ షిప్ సమ్మిట్‌కు వాళ్లని రమ్మని ఆహ్వానించామని తెలిపారు. స్నేహ సంబంధాలు కొనసాగించాలని వారిని సూచించినట్లు- పేర్కొన్నారు. అందుకు వాళ్లు సైతం ఒప్పుకున్నారని చెప్పారు.. సింగపూర్ పర్యటనలో భాగంగా మొత్తం 41 సమావేశాల్లో పాల్గొన్నానన్నారు. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ ప్రమోషన్‌లో భాగంగా ఏపీకి పెట్టు-బడులు ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు జులై 26 నుంచి 31వ తేదీ వరకు సింగపూర్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులు, కంపెనీ సీఈఓలు, పారిశ్రామికవేత్తలతో ఆయన వరుసగా భేటీ-లు నిర్వహించారు. ఆ క్రమంలో పెట్టు-బడులు పెట్టేందుకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, వనరులు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, పారిశ్రామిక పాలసీ, భూమి లభ్యత తదితర అంశాలను వారికి సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు.

ఇక ఈ ఏడాది నవంబర్‌లో విశాఖపట్నం వేదికగా పెట్టు-బడుల సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు సింగపూర్‌లోని పారిశ్రామికవేత్తలను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. అలాగే ఈ పర్యటనలో భాగంగా రౌండ్ టేబుల్ సమావేశాలు సైతం నిర్వహించారు. అదే విధంగా ఆ దేశంలోని వివిధ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ సంస్థలను సీఎం చంద్రబాబు సందర్శించిన విషయం విదితమే. ఈ సింగపూర్ పర్యటనలో సీఎం చంద్రబాబు వెంట.. మంత్రులు నారా లోకేష్, టీ-జీ భరత్, పి నారాయణతోపాటు- పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ పర్యటనను ముగించుకుని జులై 30వ తేదీన చంద్రబాబు, మంత్రులు లోకేష్, టీ-జీ భరత్‌లు అమరావతికి తిరిగి వచ్చిన విషయం తెలిసిందే.జగన్ ప్రభుత్వ నిర్వాకంతో సింగపూర్ ప్రభుత్వం భయపడిందని సీఎం చంద్రబాబు అన్నారు. సడలిన నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు చాలా కష్టపడాల్సి వచ్చిందని చెప్పారు. మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం రాజకీయాంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. పెట్టుబడుల సదస్సుకు వచ్చేందుకు సింగపూర్ ప్రభుత్వం తేలిగ్గా అంగీకరించలేదన్నారు. వైకాపా హయాంలో సింగపూర్ వెళ్లి మరీ అక్కడి మంత్రులను బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు ఏడాదిగా సబ్జెక్టు నేర్చుకుంటూ మెరుగ్గా పనిచేశారు. ఇక హనీమూన్ కాలం వదిలి పాలనలో దూకుడు పెంచాలి. తప్పుడు వార్తల ప్రచారం, వైకాపా కుట్రలు, అతి తెలివైన నేరగాళ్ల పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలి. మహిళలపై అసభ్య వ్యాఖ్యలను గట్టిగా తిప్పికొట్టాలి. అంతర్జాతీయ సంబంధాలకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు- చేస్తాం. సింగపూర్ విధానాల స్టడీకి మంత్రులు దశలవారీగా అక్కడికి వెళ్లాలి. ప్రభుత్వం పట్ల ప్రజల్లో పూర్తి సానుకూలత ఉంది. మంత్రుల పనితీరుతో అది మరింత పెరగాలి. ఎమ్మెల్యేలతో మాట్లాడా.. పొరపాట్లు- సరిదిద్దుకుంటామని చెప్పారు. జనసేన, భాజపా నేతలు కూడా లోపాలను సరిదిద్దుకోవాలి. మంత్రులు తమ శాఖలపై ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేసుకోవాలి. వచ్చే క్యాబినెట్ భేటీలో ప్రతి మంత్రితో వారి శాఖపై మాట్లాడిస్తా అని చంద్రబాబు చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు టికెట్ నమూనాను ఈ సందర్భంగా మంత్రులకు సీఎం చూపించారు.

# 42శాతం రిజర్వేషన్లు ఇస్తారా..గద్దె దింపాలా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోడీని గద్దె దింపుతామని హెచ్చరించారు. బీజేపీ మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ చెప్పినా మోడీ ప్రధాని పదవి వదులుకోవడం లేదని.. 75 ఏళ్ల నిబంధన ఆయనకి వర్తించదా అని ప్రశ్నించారు. మోడీ గద్దె దిగినా.. దిగకపోయినా.. 2029లో మేమే ఆయనను గద్దె దింపి.. రాహల్ గాంధీని ప్రధానిని చేసుకుంటామని..ఇదే మా శపథమని ఘాటు వ్యాఖ్యలు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని 150 సీట్లకే పరిమితం చేస్తామని సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ టీ-పీసీసీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..రిజర్వేషన్లు 42 శాతం ఇవ్వాలని రెండు బిల్లులను ఆమోదించాం. ఆనాటి సీఎం కేసీఆర్ బీసీలపై కక్ష్య గట్టి తెలంగాణలో 50 శాతం మించకుండా చట్టం చేశారు. బలహీన వర్గాలకు అన్యాయం చేసే చట్టాన్ని తొలగించేందుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చాం. విద్యా, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును చట్టం చేసి గవర్నర్ రాష్ట్రపతికి పంపించారు. 50 శాతం క్యాప్‌ను తొలగించే ఆర్డినెన్స్ కూడా రాష్ట్రపతి దగ్గరకు వచ్చింది. నాలుగు నెలలు గడిచినా ఆమోదం లేదు. బీసీలకు అన్యాయం చేస్తుంటే గల్లీ నుంచి ఢిల్లీకి వచ్చి ధర్నా చేపట్టాం అని అన్నారు. హైదరాబాద్‌లో, తెలంగాణలో చేస్తే తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పార్టీల మద్దతు మాత్రమే ఉంటుంది. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేస్తే దేశ వ్యాప్తంగా ఉన్న పార్టీల మద్దతు ఇస్తున్నారు. అదే విధంగా ఇండియా కూటమి పార్టీలు, నేతలు కూడా మద్ధతు ఇస్తున్నారు. తెలంగాణ కోసం పార్లమెంటులో మోదీ సర్కార్?తో కొట్లాడుతామని ధర్నాకు వచ్చి అండగా నిలిచారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జోడో యాత్ర చేసి దేశానికి రాహుల్ హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కులగణన చేస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారని అంటూ, ఆ హామీ మేరకు 42శాతం చట్టం చేశామని అన్నారు. కామారెడ్డిలో 42 శాతం బీసీ డిక్లరేషన్ ఇచ్చాం. రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య కామారెడ్డిలో హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయని సాహసం మేము చేశాం. కేబినెట్ మంత్రులు నాకు అండగా నిలిచి 300 మంది సీఎంలు చేయలేని పనిని చేసే అవకాశం నాకు కల్పించారు. దేశానికే ఆదర్శంగా నిలబడటానికి తెలంగాణ సీఎంగా నాకు అవకాశం వచ్చింది. రాహుల్ గాంధీ సందేశాన్ని అందిపుచ్చుకుని.. జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించాం అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. మోడీ సర్కార్ బిల్లులకు ఆమోదం తెలిపే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, భాజపా నేతలు బీసీ రిజర్వేషన్ బిల్లులను అడ్డుకొని బలహీనవర్గాలకు అన్యాయం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు ఇస్తామంటే గుజరాత్ వారికి కడుపుమంట ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. గల్లీలో ఉండలేక దిల్లీలోనే తేల్చుకుందామని 'చలో దిల్లీ' చేపట్టామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలాగైనా సాధిస్తామన్నారు. దిల్లీలో ధర్నాకు వంద మంది ఎంపీలు, ఇండియా కూటమి పార్టీలు మద్దతు ఇచ్చాయన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం 4 కోట్ల మంది ముక్త కంఠంతో విజ్ఞప్తి చేశారు. జంతర్ మంతర్ వేదికగా మోదీ, ఎన్డీయేకు సవాల్ విసురుతున్నా. మా డిమాండ్‌ను ఆమోదిస్తారా?మిమ్మల్ని గద్దె దించాలా? మా ఆలోచనలు, బిల్లులను తుంగలో తొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు? మోదీ మన బద్ధశత్రువు.. బలహీనవర్గాలకు న్యాయం చేసే ఆలోచన ఆయనకు లేదు. ఆయన మోచేతి నీళ్లు తాగే కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచంద్రరావుకు ఏమైంది?తెలంగాణలో మీరు బలహీనవర్గాలను ఓట్లు అడగలేదా?ప్రజలతో మీ అవసరం తీరిపోయిందా?పేరు బంధం తెగిన తెరాస పేగు బంధం కూడా తెలంగాణతో తెగిందా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈసందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై మరోసారి విరుచుపడ్డారు సీఎం రేవంత్ రెడ్డి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పిస్తే.. ఆ రెండు పార్టీలు మోకాలడ్డేస్తున్నాయని ఫైర్ అయ్యారు. బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీలో మేం బిల్లులు ఆమోదిస్తే.. మా బిల్లును తుంగలో తొక్కే హక్కు మీకు ఎవరిచ్చారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీసీ పేరుతో కాంగ్రెస్ డ్రామాలేస్తుందని డ్రామారావు అంటుండు. కానీ డ్రామాలు ఆడేదే కల్వకుంట్ల ఫ్యామిలీ అని తెలంగాణ రాష్ట్రమంతా తెలుసని రేవంత్ కౌంటర్ ఇచ్చారు. డ్రామా మీ కుటుంబంలో ఉంటే.. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే చిత్తశుద్ధి మాకుందన్నారు. మీ ఇంట్లనే పరిస్థితి సక్కగ లేదు. ఒకరు బీసీలకు మద్ధతు అంటారు.. ఇంకొకాయన అసలు మాట్లాడరు.. మరొకరు మధ్యరకం అంటారు.. అటు- ఇటు- గానీ వాళ్లు నా గురించి మాట్లాతారా అని ఫైర్ అయ్యారు.వంద మీటర్ల గోతి తొవ్వి పాతిపెట్టినా మీకు బుద్ధి రాలేదని బీఆర్ఎస్‌ను క ్ డ ి గి ఎ ా ే ం శ ా ం ్ ు . బీసీ రిజర్వేషన్ల బిల్లులకు అసెంబ్లీలో మద్దతు తెలిపిన బీఆర్ఎస్.. ఆ బిల్లులకు కేంద్రం ఆమోదం తెలపాలని ఢిల్లీలో కాంగ్రెస్ చేపట్టిన మహాధర్నాకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు.బీసీల ఓట్లు- మీకు అవసరం లేదా.. బలహీనవర్గాల పట్ల ఇదేనా మీ చిత్తశుద్ధి అని నిలదీశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎందుకు నిలదీయట్లేదని ప్రశ్నించారు. బలహీన వర్గాలకు అన్యాయం చేసే ఆ చట్టాన్ని తొలగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని.. ఆ ఆర్డినెన్స్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం తొక్కిపెట్టిందన్నారు. ఈ ధర్నాలు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యలే తదితరులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికుల అకౌంట్లలోకి రూ.లక్ష జమ

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ ఎంబార్కెషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యతను ఇచ్చి, సాంకేతిక కారణాల వలన హైదరాబాద్ ఎంబార్కెషన్ కేంద్రం నుండి హజ్ యాత్ర చేసుకొని వచ్చిన ప్రతి ఒక్క హజ్ యాత్రికుని వ్యక్తిగత అకౌంట్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ తరఫున జమ చేయడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం, ఇచ్చిన మాటకు కట్టుబడి హజ్ యాత్రికులకు ఆర్థిక సహాయం ను నేరుగా వారికే వ్యక్తిగత అకౌంట్లలోకి జమ చేసి పారదర్శకతను ప్రభుత్వం నిరూపించిందని తెలిపారు. కాగా హజ్-2026 లో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుండి బయలుదేరే హజ్ యాత్రికులందరికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున కూటమి ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందుకోసం రాష్ట్రం నుండి అత్యధిక సంఖ్యలో వెళ్లే హజ్ యాత్రికులు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రంను మొదటి ప్రాధాన్యత గా ఎన్నుకోవాలని కోరారు. మైనారిటీ వర్గాల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు కు ముస్లిం ప్రజానీకం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

**జిల్లాలవారీగా లబ్ధిదారుల సంఖ్య**

గుంటూరు జిల్లా నుండి 18 మంది, కృష్ణా నుండి 18, అన్నమయ్య నుండి 14, ఎన్టీఆర్ జిల్లా నుండి 11, వైయస్సార్ కడప నుండి నలుగురు, ఏలూరు నుండి ముగ్గురు, బాపట్ల నుండి ఇద్దరు, విశాఖ నుండి ఒక్కరు, కాకినాడ నుండి ఒకరికి రూ. లక్ష ప్రకారం వారి అకౌంట్లకు జమ చేసినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు.

## 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కష్టపడి పనిచేస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కాన్ఫరెన్స్ కేవలం దేశ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ ను శక్తివంతం చేయడం, సౌర, పవన శక్తికి నైపుణ్య హబ్ గా ఏపీని తీర్చిదిద్దడమే కాదు.. ప్రపంచ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ ను శక్తివంతం చేసే దిశగా ఈ కాన్ఫరెన్స్ ను నిర్వహించడం జరుగుతోంది. తద్వారా మన యువతకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి అని వెల్లడించారు.దేశంలో ఏ పార్టీ సాధించని విధంగా కూటమి ప్రభుత్వం 94 శాతం స్ట్రైక్ రేట్ తో 164 సీట్లను కైవసం చేసుకోవడం జరిగింది. కూటమి ప్రభుత్వంలో ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. ఇందుకోసం అందరం కష్టపడి పనిచేస్తున్నాం. ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. క్లస్టర్ విధానంలో పెట్టుబడులను ఆకర్షిస్తాం. ఇందుకు కావాల్సిన ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం. అనంతలో ఆటోమొబైల్, కర్నూలు రెన్యువబుల్ ఎనర్జీ, కడప, చిత్తూరును ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గా, నెల్లూరులో ఎయిర్ కండిషనర్స్ వంటి స్పెషలైజ్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ప్రకాశం జిల్లాను సీబీజీ హబ్ గా, గుంటూరు, కృష్ణాను క్యాంటమ్ వ్యాలీ హబ్ గా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను ఆక్వా హబ్ గా, ఉత్తరాంధ్రను ఫార్మా, డేటా సెంటర్, ఐటీ హబ్ గా, మెడికల్ డివైస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ గా తయారు చేస్తాం. ప్రతి వంద కిలోమీటర్లకు ఓ క్లస్టర్ ఏర్పాటుచేసి ఆయా రంగాల్లో టాప్ 20 కంపెనీలను తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నాం. దీంతో పాటు నైపుణ్యం పెంపు, నవీన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ప్రైవేటు సెక్టార్ తో నైపుణ్యం గల యువతను అనుసంధానించాల్సిన అవసరం ఉంది. సెప్టెంబర్ 1న నైపుణ్యం పోర్టల్ ను ప్రారంభించడం జరుగుతోంది. స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, సీడాప్ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తాం. ప్రపంచ అవసరాలకు అనుగుణంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రపంచవ్యాప్తంగా అనేక అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రం చొరవ తీసుకుని యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తాం. అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతను సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. నా ఛాలెంజ్ ను స్వీకరించి సుజ్లాన్ సంస్థ ఇప్పటికే 2 నైపుణ్య శిక్షణా కేంద్రాలను నిర్మించింది. అవి ఇప్పటికే పనిచేస్తున్నాయి.

# చైనా పర్యటనకు మోదీ

## గల్వాన్ ఘర్షణ తర్వాత మొదటిసారిగా...

**న్యూఢిల్లీ,ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:**
భారత్, చైనా సంబంధాలలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. గల్వాన్ లోయ ఘర్షణల అనంతరం తొలిసారిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చైనాలో పర్యటించనున్నారు. చైనాలోని తియాంజిన్ నగరంలో ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీలలో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన వెళ్లనున్నారు. 2020లో గల్వాన్‌లో ఇరు దేశాల సైనికుల మధ్య జరిగిన ఘర్షణల తర్వాత ద్వైపాక్షిక సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నాలుగేళ్ల తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.గత నాలుగేళ్లుగా వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి నెలకొన్న సైనిక ప్రతిష్టంభనకు తెరదించుతూ, సుమారు 3500 కిలోమీటర్ల సరిహద్దులో గస్తీ నిర్వహణపై ఇరు దేశాలు ఇటీవల ఒక ఒప్పందానికి వచ్చాయి. ఈ ఒప్పందం తర్వాత ద్వైపాక్షిక చర్చల్లో కీలక పురోగతి లభించింది. ఈ సానుకూల వాతావరణంలోనే ప్రధాని పర్యటన ఖరారైంది. చివరిసారిగా ప్రధాని మోదీ 2019లో చైనాలో పర్యటించారు. ఆ తర్వాత 2024లో రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు.ప్రధాని పర్యటనకు ముందు, గత రెండు నెలలుగా భారత ఉన్నత స్థాయి ప్రతినిధులు చైనాలో పర్యటించారు. జూలైలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఎస్సీవో విదేశాంగ మంత్రుల సమావేశం కోసం తియాంజిన్ వెళ్లి, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో చర్చలు జరిపారు. జూన్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ కూడా వేర్వేరు ఎస్సీవో సమావేశాల కోసం చైనాను సందర్శించారు.

ఈ పర్యటనల సందర్భంగా భారత్ తన వైఖరిని స్పష్టంగా తెలియజేసింది. ఉగ్రవాదంపై ఆందోళనలను చేర్చలేదన్న కారణంతో ఎస్సీవో రక్షణ మంత్రుల సంయుక్త ప్రకటనను భారత్ అంగీకరించలేదు. ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరిని విడనాడాలని, లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అజిత్ డోభాల్ ఎస్సీవో వేదికగా గట్టిగా డిమాండ్ చేశారు. ఈ పరిణామాల తర్వాత జరుగుతున్న ప్రధాని మోదీ పర్యటనపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది.

# భారత్ పై మరో పిడుగు

## భారత దిగుమతులపై మరో 25% అదనపు సుంకం విధిస్తూ ట్రంప్ ఉత్తర్వు

**న్యూఢిల్లీ,ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:**
రష్యా నుంచి చమురు కొనుగోలును కొనసాగిస్తున్న భారత్‌పై అమెరికా కఠిన వైఖరి అవలంబించింది. భారతదేశం నుంచి వచ్చే దిగుమతులపై అదనంగా 25 శాతం టారిఫ్ (సుంకం) విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఒక కార్యనిర్వాహక ఉత్తర్వుపై (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్) సంతకం చేశారు. గత వారం ప్రకటించిన 25 శాతం సుంకానికి ఇది అదనం కావడం గమనార్హం.ఉక్రెయిన్‌పై సైనిక చర్య నేపథ్యంలో రష్యాపై విధించిన ఆంక్షలను మరింత బలోపేతం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైట్ హౌస్ ఒక ప్రకటనలో వెల్లడించింది. భారతదేశం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకోవడం తమ జాతీయ భద్రతకు, విదేశాంగ విధానానికి ముప్పుగా పరిగణిస్తున్నట్లు అమెరికా పేర్కొంది. "అందువల్ల, వర్తించే చట్టాలకు అనుగుణంగా, యునైటెడ్ స్టేట్స్ కస్టమ్స్ భూభాగంలోకి దిగుమతి అయ్యే భారతీయ వస్తువులపై 25 శాతం అదనపు సుంకం విధించబడుతుంది" అని ఉత్తర్వులో స్పష్టం చేశారు.ఈ కొత్త సుంకాలు ఉత్తర్వుపై సంతకం చేసిన 21 రోజుల తర్వాత అమెరికాలోకి ప్రవేశించే అన్ని అర్హత కలిగిన భారతీయ వస్తువులపై అమల్లోకి వస్తాయి. అయితే, ఈ గడువుకు ముందే రవాణాలో ఉండి, సెప్టెంబర్ 17వ తేదీలోపు కస్టమ్స్ క్లియరెన్స్ పొందే సరుకులకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు కల్పించారు. ఇప్పటికే ఉన్న సుంకాలను యథాతథంగా కొనసాగిస్తూ, ఈ కొత్త టారిఫ్‌లను అదనంగా విధించనున్నారు.ఈ ఉత్తర్వులకు లోబడి ఉన్న వస్తువులు కఠినమైన కస్టమ్స్ నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. వాటిని అమెరికాలోని విదేశీ వాణిజ్య జోన్లలో 'ప్రివిలేజ్డ్ ఫారిన్ స్టేటస్' కింద మాత్రమే అనుమతిస్తారు. మారుతున్న పరిస్థితులు, ప్రభావిత దేశాల ప్రతిచర్యలు లేదా రష్యా, భారత్ విధానాలలో గణనీయమైన మార్పుల ఆధారంగా ఈ ఉత్తర్వును సవరించే అధికారాన్ని ట్రంప్ తన వద్దే ఉంచుకున్నారు.

ఇదే సమయంలో, రష్యాతో ఇతర దేశాల చమురు వాణిజ్యాన్ని నిశితంగా గమనించాలని, అవసరమైతే ఇలాంటి చర్యలనే సిఫారసు చేయాలని వాణిజ్యం, విదేశాంగ, ట్రెజరీ వంటి కీలక విభాగాలను ట్రంప్ ఆదేశించారు.

# అమెరికా చర్యలు అన్యాయం.

అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులను అమెరికా లక్ష్యంగా చేసుకుంది. ఈ వ్యవహారంపై మా వైఖరిని ఇప్పటికే స్పష్టం చేశాం. మార్కెట్ అంశాలపై ఆధారపడే మా దిగుమతులు ఉన్నాయి. 140 కోట్లమంది దేశ ప్రజల ఇంధన భద్రతను నిర్ధార్ధరించడం మా బాధ్యత. ఇతర అనేక దేశాలు తమ సొంత ప్రయోజనాల కోసం చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. భారత్‌పై అదనపు సుంకాలను విధించాలని అమెరికా నిర్ణయించడం దురదృష్టకరం. ఈ చర్యలు అన్యాయం, అసమంజసమైనవని పునరుద్ఘాటిస్తున్నాం. మా జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం అని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు జరుపుతున్న భారత్‌పై మరో 25 శాతం సుంకం విధిస్తున్నట్లు- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే భారత్‌పై 25 శాతం ప్రతీకార సుంకం విధించారు. దీంతో భారత్ నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై 50 శాతం సుంకం వర్తించనుంది. ఈ మేరకు బుధవారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేశారు. రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో అక్కసు వెళ్లగక్కుతున్న ట్రంప్.. 24 గంటల్లో భారత్‌పై భారీ టారిఫ్ వేస్తానని మంగళవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజా చర్యలు తీసుకున్నారు. ఇదిలావుంటే తాజా పరిణామంపై కాంగ్రెస్ స్పందించింది. నరేంద్ర మోదీ మిత్రుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మొత్తంగా 50 శాతం సుంకం విధించారని తెలిపింది. ట్రంప్ నిరంతరం మన దేశంపై చర్యలు తీసుకుంటు-న్నా.. ప్రధాని మోదీ మాత్రం కనీసం ఆయన పేరును కూడా ప్రస్తావించడం లేదంటూ విమర్శించింది. ఇప్పటి-కై-నా ప్రధాని మోదీ ధైర్యం చూపించాలని, ట్రంప్ చర్యలకు తగిన సమాధానం ఇవ్వాలని కోరుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టింది.

# ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా జేడీ శీలం, మస్తాన్ వలి...

**న్యూఢిల్లీ,ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:**
ఆంధ్రప్రదేశ్‌లో వరుస ఎన్నికల పరాజయాల తర్వాత పార్టీ బలోపేతంపై దృష్టి సారించిన కాంగ్రెస్ అధిష్ఠానం కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ)కి ఇద్దరు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించింది. కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీల ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నియమిస్తూ బుధవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది.

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ నియామకాలకు ఆమోదం తెలిపినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు మద్దతుగా క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు ఈ నియామకాలు జరిపినట్లు తెలుస్తోంది.

దీంతో పాటు 25 మంది సీనియర్ నేతలతో పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ)ని కూడా ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణికం ఠాగూర్ వ్యవహరించనున్నారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, పీసీసీ మాజీ అధ్యక్షుడు ఎన్. రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, కేంద్ర మాజీ మంత్రులు పళ్లంరాజు, చింతా మోహన్, జేడీ శీలం వంటి ప్రముఖులకు ఈ కమిటీలో సభ్యులుగా చోటు కల్పించారు. వీరితో పాటు కేవీపీ రామచంద్రరావు, కె.రాజు, మస్తాన్ వలీ, జీవీ హర్షకుమార్, ఎన్. తులసిరెడ్డి వంటి అనుభవజ్ఞులైన నేతలను కూడా కమిటీలో చేర్చారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 7 ఆగస్టు 2025

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందించాలి.

**వైద్యులు, సిబ్బంది రోజువారి విధులలో తప్పనిసరిగా హాజరు కావాలి. -రైతులు అవసరం మేరకు యూరియా వినియోగించాలి.**

**అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు. -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**







**ఆంధ్ర ప్రగతి గోస్పాడు, ఆగస్టు, 06:**
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందజేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం గోస్పాడు మండల కేంద్రంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రైతు సేవ కేంద్రం, ప్రైవేటు ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ఎంత మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు ? ఎన్ని డెలివరీ కేసులు నమోదు అయ్యాయి ? ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయా లేదా ? గడువు తేది ముగిసిన ఔషధాలను ఏం చేస్తున్నారు అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయం అందిస్తారనే ధీమాతో ప్రజలు ఆసుపత్రులకు వస్తారని, ఆ మేరకు పీహెచ్సీలో మెరుగైన వైద్యం అందించాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ అవ్వడం శ్రేయస్కరం అనే విషయం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఎక్కువ శాతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అందుకు అవసరమైన సిబ్బంది కొరత ఉంటే కూడా భర్తీ చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. అంతేకాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణంలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం వైద్య చికిత్స కోసం వచ్చిన వారితో కూడా కలెక్టర్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఏ సమస్యతో ఆసుపత్రికి వచ్చార, వైద్యులు బాగా చూస్తున్నారా, వైద్య సేవలు ఎలా ఉన్నాయి, టెస్టులు ఇక్కడే నిర్వహిస్తున్నారా లేదా తదితర అంశాలలో వచ్చిన పేషంట్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం అక్కడికి సమీపంలోని రైతు సేవ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంత మేర రైతుల పొలాలు రైతు సేవా కేంద్రంలో నమోదు అయ్యాయి, రైతులందరికి ఈ పంట నమోదు, రైతుల ఈ-కెవైసి పూర్తి చేశారా, ఎంత విస్తీర్ణం పూర్తి చేశారు, ఇంకా ఎంత చేయాల్సి ఉంది, యూరియా లభ్యత ఎంత మేర ఉంది, ఇంకా అదనంగా ఎంత మేర యూరియా అవసరం అనే విషయాలను రైతు సేవా కేంద్రం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా రైతులకు పంటలకు సరిపడా యూరియా మాత్రమే వినియోగించేలా అవగాహన కల్పించాలని తద్వారా భూసారం తగ్గకుండా పంటకు సరిపడా దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.
అనంతరం మండల కేంద్రంలోని శ్రీ వెంకట సాయి ప్రైవేటు ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో ఎరువులు, డిఎపి ఎంత మేర నిల్వలు ఉన్నాయని రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువుల అవసరం మేరకు రైతులు వచ్చినప్పుడు అధిక ధరకు విక్రయించకుండా ప్రభుత్వం నిర్దేశించిన ధరకు మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్ట పరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని దుకాణదారులను కలెక్టర్ హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎంపీడీవో పీహెచ్సీ వైద్యులు సిబ్బంది, ఆర్ఎస్కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెన్సిలిన్ ఆవిష్కర్త సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ సేవలు చిరస్మరణీయం.

**సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.**



**ఆంధ్ర ప్రగతి డోన్ ఆగస్టు 06:** అగస్టు 6 న మొట్ట మొదట యాంటీబయాటిక్ పెన్సిలిన్ మందు కనుగొన్న శాస్త్రవేత్త శ్రీ సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ జయంతి సందర్భంగాడోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యం లో ప్రముఖ ప్రపంచ మొట్ట మొదటి యాంటీబయాటిక్ పెన్సిలిన్ కనుగొన్న సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి మాట్లాడుతూ..మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి పేర్కొన్నారు.శ్రీ సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ గారు స్కాట్లాండ్‌లో 1881 ఆగస్టు 6 ఓ రైతు కుటుంబంలో జన్మించారు. ఈయన తండ్రి హుగ్ ఫ్లెమింగ్, తల్లి గ్రేసీ స్టిర్లింగ్ మోర్టన్. ఫ్లెమింగ్ జీవ శాస్త్రవేత్త మరియు వైద్యుడు. 1923 లో కనుగొన్న ఎంజైములు, లైసోజైములు, 1928 లో కనుగొన్న ప్రపంచ మొట్ట మొదటి యాంటీబయోటిక్ పెన్సిలిన్ ఈయన పరిశోధనల్లో ముఖ్యమైనవి. పెన్సిలిన్ బ్యాక్టీరియాలజీ, ఇమ్యునాలజీ, కీమోథెరపీ మీద అనేక వ్యాసాలు రాశాడు.అతి గొప్ప ఆవిష్కరణగా కోట్లాది మంది ప్రాణాలకు రక్షణగా గుర్తింపు పొందింది "పెన్సిలిన్". పెన్సిలిన్ వల్ల ఎన్నో ప్రాణాంతక వ్యాధుల నుంచి మానవాళికి రక్షణ కలిగించింది. దీన్ని కనిపెట్టినందుకు ఫ్లెమింగ్ గారు 1945 లో నోబెల్ బహుమతిని పొందారు. ఈయన మార్చి 11, 1955 స్వర్గస్తులైనారు.ప్రపంచానికి అరోగ్యాన్ని అందించిన ఇలాంటి మహానుభావులను ఎల్లవేళల స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు అనేక పరిశోధనలు చేసి దేశానికి సేవ చెయ్యాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.

# జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన శాంతినికేతన్ విద్యార్థులు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 06:** నంద్యాల క్రాంతి నగర్ నందలి శ్రీ శాంతినికేతన్ సిబిఎస్ఇ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు గత నెల 26వ తేదీన కోవెలకుంట్ల పట్టణము నందు నిర్వహించిన నంద్యాల జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొని అత్యంత నైపుణ్యాన్ని కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థుల కు శాంతినికేతన్ విద్యాసంస్థల యందు విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో సుధాకర్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి షూటింగ్ పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో దాగివున్న అపారమైన నిఘాశక్తిని వెలికితీస్తాయన్నారు. తమ విద్యార్థులు జిల్లా స్థాయికి మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్ర, జాతీయ ,అంతర్జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఇలాంటి ప్రశంసా పత్రాల ద్వారా భవిష్యత్తు ఉద్యోగ జీవితానికి భరోసా దొరుకుతుందన్నారు. విద్యార్థులకు ఉత్తమ శిక్షణ నిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జానీ, సతీష్, మధు, శ్రీలేఖ లనుఅభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు ,ఉపాధ్యాయులు ,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మరో యువగళం హామీని నెరవేర్చిన మంత్రి నారా లోకేష్.

**కర్నూలు పట్టణం గూడెం కొట్టాలుకు చెందిన 150 మంది నిరుపేదలకు శాశ్వత ఇళ్ల పట్టాల పంపిణీ.**

**తమ 40 ఏళ్ల కల నెరవేర్చారని మంత్రి లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపిన గూడెం కొట్టాలు వాసులు.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు ఆగస్టు 06:**
విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మరో యువగళం హామీని నెరవేర్చారు. కర్నూలు పట్టణం అశోక్ నగర్ లోని నగరపాలక సంస్థ పంప్ హౌస్ ప్రాంతంలో నాలుగు దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలంలో నివాసం ఉంటున్న 150 మంది గూడెం కొట్టాలు వాసులకు శాశ్వత ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. నిరుపేదలైన వీరు గూడెం కొట్టాల ప్రాంతంలో పూరి గుడిసెలు వేసుకుని నాలుగు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారు. తమకు శాశ్వత పట్టాలు ఇవ్వాలని ఏళ్ళుగా ప్రజాప్రతినిధులను కోరుతున్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. యువగళం పాదయాత్రలో భాగంగా కర్నూలు వచ్చిన నారా లోకేష్ ను అప్పటి కర్నూలు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ టీజీ భరత్ నేతృత్వంలో గూడెం కొట్టాలు




వాసులు కలిసి తమకు శాశ్వత పట్టాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన నారా లోకేష్... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శాశ్వత పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వంలో 2025 జనవరిలో తీసుకువచ్చిన జీవో నెంబర్ 30 ద్వారా కోట్ల విలువ చేసే సుమారు ఎకరా స్థలాన్ని నిరుపేదలకు అప్పగించారు. మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా 150 మంది నిరుపేదలకు



మంగళవారం నాడు శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. తమ 40 ఏళ్ల కల నెరవేర్చిన మంత్రి నారా లోకేష్ కు ఈ సందర్భంగా గుడెం కొట్టాల వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఈవ్ టీజింగ్ కు పాల్పడితే సమాచారం అందించండి.

**శక్తి యాప్ ఉపయోగించే విధానం,ప్రయోజనాలపై అవగాహన.**

**- మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జయరాం.**

**నంద్యాల పట్టణ కేంద్రంలోని గవర్నమెంట్ బాలికల కళాశాలలో ప్రస్తుత చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ ఆగస్టు 06:**
నంద్యాల ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జయరాం నంద్యాల పట్టణ కేంద్రంలోని గవర్నమెంట్ బాలికల కళాశాల నందు ప్రస్తుత చట్టాలపై, శక్తి యాప్, ఈవ్ టీజింగ్ మొదలగు వాటిపై అవగాహన అల్పించడం జరిగింది.ఈ సంధర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత చట్టలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని ఎలాంటి క్లిష్ఠ సంధార్భాలు వచ్చిన ఎదుర్కొనేల సిద్ధం కావాలని మహిళలకు ఉపయోగపడే చట్టలగురించి వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు.శక్తి యాప్ వాటి ప్రయోజనాలు ,శక్తి టీమ్ జిల్లాలో ఏ విధంగా పనిచేసేవిధానం గురించి వివరించారు.ఏదైనా కొత్త ప్రదేశం వెళ్లినప్పుడు అక్కడ వన్ స్టాప్ సాయం కోరే శక్తి యాప్ లోని ఫీచర్స్ వివరించారు. ఏదైనా అపాయం వచ్చినప్పుడు మహిళలు తమను తాము రక్షించుకునేదుకు సెల్ఫ్ డిఫెన్స్ పై కూడా జిల్లా శక్తి టీం బృందాలు అవగాహన కల్పించడం జరుతుందన్నారు.ఎవరైనా ఈవ్ టీజింగ్ కు గురైతే పోలీసులకు సమాచారం అందించాలని అత్యవసర సమయంలో ఉపయోగించవలసిన నంబర్ల వివరాలు తెలియజేశారు.ఏ ఆపదలోనైనా 112 కాల్ చేయండి. ఏదైనా సైబర్ నేరాలు జరిగినప్పుడు 1930,ఉమెన్ హెల్ప్ లైన్ మరియు చైల్డ్ మ్యారేజెస్ మొదలగు వాటికి 181 డయల్ చేయండి.చిన్నపిల్లల రక్షణ మరియు భద్రత కొరకు 1098, డ్రగ్స్ టోల్ ఫ్రీ నంబర్ 1972 మొదలగు వాటిపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమనకు మహిళా కాలేజీ ప్రిన్సిపాల్ మరియు డిస్టిక్ హెడ్ క్వార్టర్ మరియు సబ్ డివిజనల్ శక్తి టీమ్ మెంబర్స్ పాల్గొన్నారు.

# బీసీపార్టీలు అన్నీ ఒక తాటిపైకి వచ్చి రాజ్యాంగ హక్కులు కోసం పోరాడాలి.

**ఆల్ పీపుల్స్ పార్టీ జాతీయ కార్యదర్శి మంజుల సుబ్బారాయుడు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 06:**
కొంతమంది మేధావులు కొంతమంది రాజకీయ ఉద్దండులు బీసీలకు రాజ్యాంగంలో రాజకీయ అక్కులు కల్పించడానికి రకరకాల ఆరోపణలు చేస్తూ విభిన్న పరిస్థితులలో ద్వంద వైఖరిని అవలంబిస్తున్నారు,ఇలా ఎన్ని రోజులు కొనసాగిస్తారు, ఎన్ని సంవత్సరాలు కొనసాగిస్తారు, మీ పరిపాలన?
బీసీలు ఉద్యమాలు ఎందుకు ఎవరికి ఉపయోగపడతాయి, అసెంబ్లీ తీర్మానాలు అయిపోయినాయి,కేంద్రం అడ్డుపడుతుంది,ఈ కుంటి సాకులు చెబుతూ గత 30 ఏళ్ల నుండి అదిగో వచ్చా పులి అదిగో వచ్చా పులి అని సామెతలు చెబుతూ బతుకుతున్నారు కొంత మంది మేధావులు, అసలు రిజర్వేషన్లు అవసరమా అంటున్నారు,ఈ మాటలు అనేటప్పుడు నేను చెప్పే వాటికి సమాధానం చెప్పాలి,బీసీ లను రాజకీయంగా ఎదగకుండా ఎందుకు దూరం పెడుతున్నారు. అగ్రవర్ణాల పార్టీలు ఆధిపత్యం కొనసాగిస్తున్నాయి. ప్రతి పార్టీ కులాలను నెత్తినెత్తుకొని ప్రచారం చేసేటప్పుడు, ప్రతి కులానికి రాజకీయరంగ ప్రవేశములో ప్రాధాన్యత కల్పించకూడదా! ఉద్యోగాలలో ప్రాధాన్యత కల్పించకూడదా! విద్యాసంస్థలలో ప్రాథమిక కల్పించకూడదా!ఆరోగ్య భద్రత లో ప్రాథమిక కల్పించకూడదా! ఇ వల్ల ఎవరి చొత్తూలైనాయి?ఇవి మీ కనులకు కనపడడం లేదా?రాజకీయంలో ఏ కులమైనా ఒకసారి పోటీ చేసి ఎమ్మెల్యే గాని ఎంపీ గాని, జడ్పిటిసి గాని ఎంపీటీసీ గాని, సర్పంచ్ గాని,ప్రజా ప్రతినిధి అయిన తర్వాత రెండోసారి పోటీకి అనరుడు అని ప్రకటించాలి, అప్పుడు రిజర్వేషన్లు ఎవరికి అవసరం లేదు,ఎస్టి ఎస్సి



పాలకులకు రిజర్వేషన్లు కల్పించిన పార్టీల అధినేతలకు తొత్తులై వారు చెప్పిన దానికి గంగిరెద్దుల తల ఊపి సంతకాలు పెట్టాలి ఇంకా ఎందుకు రిజర్వేషన్ పేరుకు రిజర్వేషన్ పెత్తనం మీదా! ఇలాంటి దొంగ వైఖరితో మేధావుల పూరమంట అలాంటి మాటలు విని 78 సంవత్సరాలు స్వాతంత్రం వచ్చిన పేదోడు పేదోలుగా ఉన్నాడు ఉన్నోడు అధికంగా పెరుగుతాబోతున్నాడు రాజకీయం వల్లనే జరుగుతుంది రాజకీయం లేని వాడు ఇంత దురుద్దేశంతో మాట్లాడడు మేధావులను పెంచి పోషిస్తున్నది కూడా ఈ పార్టీల వినాయకత్వం వారి ఇకపోతే ఏ ఛానల్ చూసినా అగ్రవర్ణాల వారివే ఏ పేపర్ చూసినా అగ్రవర్ణాల వారివే దానిలో పనిచేసేది మాత్రం ఎస్టీలు ఎస్సీలు, బీసీలు మైనార్టీలు స్వతాగరాసే హక్కు ఉండదు ఏదైనా ధైర్యంగా చెప్పేంత సాహసం చేసే వారిని అది నాయకత్వం వారిని పక్కన పెడుతుంది వారు చెప్పినట్లే వినకపోతే వారికి ఉద్యోగరీత్యా ఉపాసన పలుకుతారు ఇది మన రాజ్యాంగంలో కల్పించిన హక్కులు అని అంటున్నారు ఇది కరెక్టేనా ఎంతవరకు సబబు అందుకే మేధావులారా ఎవరైతే రిజర్వేషన్లు అవసరమా అంటున్నారో ఇది వారికి చెంపపెట్టు లాంటి సందేశం కావున ప్రతి కులానికి రాజకీయరంగ ప్రవేశం కల్పించాలి అప్పుడే వారి స్థితిగతులు మెరుగవుతాయి ఈ ప్రాధాన్యత ఉన్నప్పుడు అన్ని రంగాలలో రాణించగలుగుతారు గుర్తుపెట్టుకుని బీసీలు ఎందుకు రిజర్వేషన్ల కోసం పోరాడుతున్నారు అని ఆలోచించండి వెనుకబడిన బడుగు బలహీన వర్గాలు ఎదుగుదలకు ఎందుకు నోచుకోలేదు అంటే కేవలం అగ్రవర్ణాల పార్టీల పెత్తనమే ఈ పెత్తనం తగ్గించుకుంటే ప్రజాస్వామ్యంలో అందరూ సమానము అన్నప్పుడు అన్ని రంగాలలో అందరికీ హక్కులు కలిగాలన్నప్పుడు నిస్వార్థమైన రాజకీయం చేస్తే ప్రతి ఒక్కరికి బాగుంటాది మీ ఉచిత సేవలు ఎవరికి అవసరం లేదు కావల్సింది ఉచిత విద్య ఉచితవైద్యం ఉద్యోగం ఉపాధి కల్పించినప్పుడు ఎవరికి ఏ రిజర్వేషన్లు అవసరం ఉండదు అవి చేతకాకనే కార్పొరేట్ వ్యవస్థలను ఎక్కడెక్కడో నింటో తీసుకొచ్చి వారికి భూములు కట్టబట్టి వారికి ఫైనాన్స్ కట్టబెట్టి ఈ కమిషన్లు దండుకుని మీ ఎదుగుదలకు ప్రాధాన్యతను నోచుకుంటున్నారే తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదు అగ్రవర్ణాల పార్టీలే రాజకీయం చేయాలని శాసించి కూర్చున్నారు ఈ విధానం ఎప్పుడు పతనమైపోతాదో ఇప్పుడే అందరికీ అవకాశం దక్కుతుంది దేశం బాగుంటాది రాష్ట్రాలు బాగుపడతాయి ఇది ఆలోచించండి మిత్రమా బీసీల పార్టీలన్నీ ఏకం కావాలి.

# ట్రంప్ విపరీత ధోరణి ప్రపంచానికి పెను సవాల్



**ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:**
ట్రంప్ విపరీత ధోరణి ప్రపంచానికి పెను సవాల్ కానుంది. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు చూస్తుంటే అమెరికాకు గులాంగిరీ చేయాలన్న ధోరణి కనిపిస్తోంది. వివిధ దేశాలపై అక్కసు వెళ్లగక్కడం, విపరీతంగా సుంకాలు విధించడం, మేం చెప్పినట్లుగానే నడచుకోవాలనడం, ఫలానాదేశంతో వాణిజ్యం చేయవద్దు, అమెరికా వచ్చే విద్యార్థులపై ఆంక్షలు పెట్టడం వంటివన్నీ పిచ్చోడి చేతిలో రాయిలా ఉన్నాయి. ఇంత దారుణంగా గతంలో ఏ రాజ్యాధినేతా వ్యవహరించలేదు. ఎవరు ఎవరితో వ్యాపార్యం చేయాలో నిర్ణయించ డానికి ట్రంప్ ఎవరు. మార్కెట్లో సరుకులు ఎక్కడ కొనాలన్నది ట్రంప్ ఆదేశిస్తే ఎలా? ఏ దేశమైనా తాను ఉత్పత్తి చేసే సరుకులను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంది. తనకు అవసరమైన వస్తువులను అనువైన ధరలకు ఇచ్చే దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. వ్యాపారా, వాణిజ్య పరంగా ఆయా దేశాలకు ఉన్న స్వేచ్ఛ ఇది. ఎక్కడి నుంచి ఎంతకు కొనాలో, సుంకాలు ఎంతెంత ఉండాలో ఏ దేశమూ ఏకపక్షంగా నిర్ణయించజాలదు. అమెరికా ఆధిపత్య ధోరణి ఈ ప్రాథమిక నియమానికి భిన్నంగా ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే రష్యా అత్యంత చౌకగా ముడి చమురు, సహజ వాయువును సరఫరా చేస్తోంది. భారత్, చైనా తమ అవసరాలకు రష్యా నుంచి కొనుగోలు చేస్తున్నాయి. అమెరికా అనుంగు ఆయిల్ కంపెనీలకు ఇది నష్టదాయకంగా పరిణమించి ఉండవచ్చు. దీంతో, రష్యాతో ఎలాంటి వాణిజ్య లావాదేవీలు జరిపినా ఊరుకునేది లేదని నెలరోజుల క్రితం అమెరికా హూంకరించింది. అమెరికా బెదరింపులకు అనుకూలంగా తలూపితే మన వ్యవసాయ, పాడి పరిశ్రమ రంగాలకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. పెట్రో ధరలు పెచ్చు పెరిగి, నిత్యావసరాలపైనా ఆ భారం పడుతుంది. ఇప్పటికే నిరుద్యోగం, అల్పాదాయాలు, అధిక ధరలతో సతమతమవుతున్న దేశ ప్రజానీకానికి ఇది మరింత దుర్భర స్థితిని కలిగిస్తుంది. కాబట్టి మోడీ ప్రభుత్వం దేశ సార్వభౌమత్వాన్ని నిలబెట్టేలా అమెరికాకు గట్టి సమాధానం చెప్పాలి. దేశ ప్రగతికి, ప్రజలకు నష్టం కలిగించే వాణిజ్య ఒప్పందాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు. నష్టదాయక ఒప్పందాలకు లొంగకుండా గొంతెత్తాలి! అమెరికాను బ్యాన్ చేసే దాకా పోరాడాలి. ఇదే సందర్భంలో నాటో కూటమి సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే కూడా తీవ్రమైన పరిభాషతో మన దేశాన్ని హెచ్చరించాడు. రష్యాతో వాణిజ్య వ్యాపారాలను వెంటనే నిలిపేయాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందని బెదిరింపులకు తెగించాడు. ఒక సర్వ సత్తాక స్వతంత్ర దేశాన్ని ఇలా బెదిరించటానికి అతడికున్న హక్కు ఏమిటి. ఇలాంటి పెడ ధోరణులను సహించడం సరికాదు. ఆదిలోనే తుంచేయాలి. అంతేనా అంటే మనతో శతృత్వం పెంచుకున్న పాక్‌ను చేరదీయడం, దానికి ఆయుధ సంపత్తిని, ఆయిల్‌ను పంపడం, ఆర్థిక సాయం చేయడం పాముకు పాలు పోసి పెంచడం తప్ప మరోటి కాదు. అమెరికాలో ట్విన్ టవ్స్ కూల్చివేతను ట్రంప్ మరచినట్టు ఉన్నాడు. పాక్‌ను పెంచి పోషిస్తున్న ట్రంప్‌కు గుణపాటం తప్పదు. ఒకపక్క మోడీ తానే ట్రంప్‌కు ప్రియమైన మిత్రుడైనట్టు పోజులిస్తుంటే- అమెరికా నుంచి ఈ తరహా పరోక్ష, ప్రత్యక్ష అదిలింపులూ, ఒత్తిళ్లలో అర్థమేమిటన్నది విశ్వేషించాలి. ఇలాంటి ధోరణులపై భారత్ తక్షణం స్పందించాలి. ఆధిపత్య ధోరణికి అహంకారమూ, అరాచకమూ తోడైతే ఎలా ఉంటుందో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరుతెన్నులను పరికిస్తే అర్థమవుతుంది. ట్రంప్‌ను మోసిన ఎలాన్ మస్క్‌నే మోసం చేసిన ఘనుడు ట్రంప్. ఎన్నికల ముందు మస్క్‌తో దోస్తానా కట్టి డబ్బులు ఖర్చు పెట్టించి ఇప్పుడు మస్క్‌కే మస్కా కొట్టాడంటే ట్రంప్ ఎంతటి ద్రోహియో అర్థం చేసుకోవాలి. తాను అనుకుంటున్నట్టుగా ప్రపంచాన్ని నడిపించాలని అనుకుంటున్నాడు. అందుకే సుంకాలతో బెదరిస్తూ.. కర్రపెత్తనం చెలాయించాలని చూస్తున్నట్లుగా ఉంది. దీనికి ప్రపంచ
దేశాలు ఏకమై ఎదురుదాడికి దిగాలి. నిజానికి భారత్ గట్టిగా పిలుపునిస్తే ఎక్కడో పడిపోతాడు. రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచీ పేట్రేగుతున్న తీరును మొగ్గలోనే తుంచేయాలి. అధిక సుంకాలు విధిస్తానని గత ఏప్రిల్‌లోనే ఇండియా, చైనా, బ్రెజిల్, మెక్సికో, కెనడా సహా 30 దేశాలను బెదిరించిన ట్రంప్ చైనా తదితర దేశాల నుంచి ఎదురు సుంకాలు గొంతెత్తటంతో- అమలుకు 90 రోజులు గడువంటూ మిన్నకున్నాడు. ఒకపక్క ఇండియా - అమెరికా మధ్య చర్చలు జరుగుతుండగానే- మన ఎగుమతులపై 25 శాతం సుంకాలను విధించటం, ఇది ఆగస్టు 1 నుంచే అమల్లోకి వస్తుందంటూ ఏకపక్షంగా ప్రకటించటం అమెరికా ఆధిపత్య ధోరణికి, ట్రంప్ అహంకార వైఖరికి నిదర్శనంగా చూడాలి. ఏదోవిధంగా మనదేశంపై తీవ్ర ఒత్తిడి తెచ్చి, తమ వాణిజ్య ప్రయోజనాలను సాధించాలన్నది అమెరికా వ్యూహంగా ఉన్నట్లుగా ఉంది. అయితే ట్రంప్ పెడధోరణిని అక్కడి ప్రజలే సహించడం లేదు. దీనికి భారత్ నుంచి సరైన, దీటైన సమాధానం ఇవ్వటం చాలా అవసరం. అవసరమైతే అన్నదేశాలను కూడగట్టాలి. ట్రంప్ తెంపరితనాన్ని ఎండగట్టాలి. అమెరికా ఫస్ట్ అన్న నినాదం తలకెత్తుకున్న ట్రంప్... ముంచుకొస్తున్న ఆర్థికమాంద్యం నుంచి తప్పించుకోవటానికి అధిక సుంకాలు విధించటం, యుద్ధ భయాలను పెంచటం ఓ గొప్ప పరిష్కారంగా ఎంచుకొని ఆ దిశగా పావులు కదుపుతున్నాడు. ఇది సహించాల్సిన అవసరం లేదు. విస్తారమైన వ్యాపార అవకాశాలు ఉండడంతో మనదేశంలోకి తమ వ్యవసాయ, డైరీ ఉత్పత్తులతో ముంచెత్తాలని అమెరికా తీవ్ర ఒత్తిడి తెస్తోంది. మోడీ ప్రభుత్వం ఆ ఒత్తిళ్లకు తలొగ్గి, ఇప్పటికే లక్షల కోట్ల విలువైన ఆయుధాల కొనుగోలుకు, చమురు దిగుమతికి అంగీకరించింది. మరింత వాణిజ్య చొరబాటుకు ట్రంప్ పరివారం మంత్రాంగం నడుపుతోంది. వ్యవసాయ, పాల ఉత్పత్తులు, ఔషధ రంగాల్లోకి తన కార్పొరేట్ తాబేదార్లను దించాలని ప్రయత్నిస్తోంది. ఈ పన్నాగంతోనే తీవ్ర ఒత్తిళ్లకు, పెత్తందారీ పోకడలకు దిగుతోందని అర్థం చేసుకోవచ్చు. వీటికి తలొగ్గకుండా మేకిన్ ఇండియా అంటున్న మోడీ గట్టిగా స్వదేశీ నినాదంతో ముందుకు సాగాలి. నిలబడి కొట్లాడాలి. మనదేశంలో మన వస్తువులే వాడితే ప్రపంచ దేశాల పెత్తనం ఉండదు. ట్రంప్ తలనొప్పి ఉండదు. భారత టెక్కీలు అమెరికా వీడితే మన పవర్ ఏమిటో తెలుస్తుంది.

# అమ్మతనాన్ని అమ్ముకున్న నమ్రత

## ఫర్టిలిటీ సెంటర్లపై నమ్మకం కోల్పోయేలా చేసిన సృష్టి




హైదరాబాద్,**ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:**అమ్మతనాన్ని కూడా అమ్ముకోవడమెలాగో సృష్టి ఫర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత చూపించారు. ఇందులో బయటపడ్డ నిజాలు ఇప్పుడు విపరీత ధోరణలును బయటపెట్టాయి. ఇలాంటి సెంటర్లు ఎన్ని ఉన్నాయో వాటి కార్యకలాపాలపైనా దృష్టి సారించాలి. సరోగసీ పేరుతో ఇతరల పిల్లలను అప్పగించి లక్షల్లో దండుకోవడమనే వ్యాపారంలో నమ్రత బాగా ఆర్జించారు. కొన్నేళ్ల క్రితమే మోసాలు బయటపడి నమ్రత లైసెన్స్ రద్దు కావడంతో ఆమె ఇతర వైద్యులను బినామీగా పెట్టుకుని వారి పేరిట లైసెన్స్ తీసుకుని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, కర్ణాటక, ఒడిసా, కోల్‌కతా తదితర ప్రాంతాల్లో సృష్టి ఫర్టిలిటీ- సెంటర్ శాఖలు నిర్వహిస్తున్నట్లు- పోలీసులు గుర్తించారు. ఎంతోమంది దంపతులను సరగసీకి ఒప్పించిన డాక్టర్ నమ్రత.. ఒక్కో జంట నుంచి రూ.30 నుంచి రూ.50 లక్షల వరకు దోచుకున్నట్లు- పోలీసులు గుర్తించారని తెలిసింది. అనేక కోణాల్లో విచారించిన పోలీసులు ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయిస్తుండగా ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు- పోలీసులు తెలిపారు. బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది. నమ్రత ముఠాలో కీలక పాత్ర పోషించి కల్యాణి, సంతోషిలను పోలీసులు విచారిస్తున్నారు. ఇప్పటికే 15 మందిని అరెస్టు చేయగా.. మరికొందర్ని అరెస్టు చేయవచ్చని సమాచారం.

ఈ క్రమంలో పోలీసుల విచారణలో సికింద్రాబాద్ సృష్టి ఫర్టిలిటీ- సెంటర్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతో ప్రధాన నిందితురాలు, ఆ కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆమెను ఐదు రోజులు కస్టడీకి తీసుకుని విచారించిన గోపాలపురం పోలీసులు... సృష్టిలో మోసాలపై కీలక విషయాలు రాబట్టినట్లు- తెలిసింది. మంగళవారం పోలీసు కస్టడీ ముగియడంతో ఆమెను మేజిస్ట్రేట్ ఎదుట హాజరపరిచి, తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. మరోవైపు, సోమవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న బినామీ డాక్టర్ విద్యుల్లతను పోలీసులు విచారించి సృష్టిలో మోసాలపై కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఇటీవల నమ్రత రాజస్థాన్‌కు చెందిన గోపాల్ సింగ్ దంపతులను సరగసీ పేరిట నమ్మించి.. మోసగించిన విషయం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఒడిసా దంపతులకు పుట్టిన బిడ్డను రూ.90 వేలకు కొన్న నమ్రత.. ఆ బిడ్డను రాజస్థాన్ దంపతులకు రూ.35 లక్షలకు విక్రయించింది. సరగసీ పేరుతో శిశు విక్రయాలకు పాల్పడుతున్న నమ్రతకు తెలంగాణతో పాటు ఆంధప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌కు చెందిన చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాలతో సంబంధాలు ఉన్నట్లు- పోలీసుల దర్యాప్తులో వెల్లడైందని తెలిసింది. ఆ ముఠాలకు బట్టి రూ.లక్ష నుంచి 5 లక్షల వరకు చెల్లించి చిన్నారులను కొంటు-న్నట్లు- గుర్తించారు. ఆ పిల్లల్నే సరగసీ ద్వారా పుట్టినట్లు నమ్మించి పిల్లలు లేని దంపతుల నుంచి రూ.30 నుంచి 50 లక్షలు తీసుకుంటున్నట్లు తేలింది. ఈ దందాలో హర్ష, పవన్, నందిని అనే వ్యక్తులు కీలకంగా వ్యవహరించినట్లు- పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. ఈ ఒక్క కేసు ఆధారంగా మిగతా ఫర్టిలిటీ సెంటర్ల తీరును పరిశీలించాలి. వాటి కార్యకలాపాలపై దృష్టి సారించాలి.

# ఉత్తరాది రాష్ట్రాలను ముంచెత్తుతున్న వరదలు


## చిక్కుకుపోయిన యాత్రికులు



ఢిల్లీ, **ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:** హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను ఆకస్మిక వరదలు చుట్టుముడుతున్నాయి. ఉత్తరకాశీ జిల్లాలో జలవిలయం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా హిమాచల్ ప్రదేశ్‌లో మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. హిమాచల్ రాష్ట్ర వ్యాప్తంగా గతకొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. టాంగ్లింగ్ ప్రాంతంలో కురిసిన వర్షం కారణంగా కిన్నెర్ కైలాష్ యాత్ర మార్గంలో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ వరదల్లో వందలాది మంది యాత్రికులు పర్వత మార్గంలో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సాహసోపేతమైన ఆపరేషన్ చేపట్టారు. రోప్‌వే సాయంతో దాదాపు 413 మంది యాత్రికులను రక్షించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. కాగా, రెండు రోజుల నుంచి హిమాచల్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు చాలాచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఈ కారణంగా దాదాపు 450 రోడ్లను అధికారులు మూసివేశారు. ముఖ్యంగా మండి జిల్లా అత్యంత ప్రభావితమైంది. ఇక్కడ దాదాపు 295 రోడ్లు మూసుకుపోయాయి. ఇక సిమ్లాలోని చక్కీమోర్ వద్ద కొండచరియలు విరిగిపడటంతో కీలకమైన చండీగఢ్-సిమ్లా జాతీయ రహదారిని అధికారులు మూసివేయాల్సి వచ్చింది. రాష్ట్రంలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉనా, కాంగ్రా, మండి, సిర్మౌర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆ నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

# కొత్త మద్యం విధానంతో అధిక ఆదాయంపై దృష్టి

**అమరావతి,ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:**
సూపర్ సిక్స్ అమలు కావాలంటే మద్యం బాగా అమ్మాలి. మద్యంతో ఆదాయం పెరగాలి. ఆదాయ వనరులు పెంచుకోవాలి. జగన్ ఏకంగా నకిలీ మద్యంతో ఆదాయాన్ని పెంచుకున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ఎపి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీకి పచ్చజెండా ఊపింది. జగన్ హయాంలో బార్‌లలో ధరలను బార్లా తెరిచేశారు. అప్పటి ప్రభుత్వం ఇష్టానుసారం ధరలు పెంచుకోవచ్చని జీవో ఇవ్వడంతో అడ్డూ అదుపూ లేకుండా మందుబాబుల జేబులను గుల్ల చేశారు. వైసీపీ ప్రభుత్వం ఒకవైపు మ ద్యం ధరలను నూరుశాతం పెంచగా, బార్‌లలో దానిపై మరింత అదనంగా లాగేశారు. క్వార్ట రుకు రూ.50-రూ.70, బీర్‌కి ఏకంగా రూ.100- రూ.120 తీసుకుంటూ దోపిడీ చేశారు. ఐదేళ్లూ ఈ దందా సాగింది.ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ దోపిడీకి కొత్త మద్యం పాలసీతో అడ్డుకట్ట వేసింది. బార్‌లలో కూడా దుకాణాల్లో ధరలనే అమలుచేయాలని నిర్ణయానికి వచ్చింది. దుకా ణాల కంటే 10 శాతం ఎక్కువ ధర చెల్లించి బా ర్‌లు ప్రభుత్వ మద్యం డిపోల నుంచి కొనుగోలు చేస్తాయి.బార్‌లలో కూడా దుకాణాల ధరే నిర్ధా రిస్తే ఆ శాతాన్ని ప్రభుత్వం నష్టపోవాల్సి ఉంటుంది. దరఖాస్తు రుసుం రూ.5 లక్షలు ఉంటుందని చెబుతున్నారు.మద్యం బార్ల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలసీకి రూపకల్పన చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో 2022-25 మధ్య అమలైన మద్యం బార్‌ల పాలసీ గడువు ఆగస్టు 31వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 1వ తేదీ నుంచి రాష్ట్రంలో కొత్త మద్యం బార్‌ల పాలసీ అమలుకు గ్రీన్‌సిగ్నల్ పడింది. ముందస్తుగా ఈ పాలసీ అమలుకు రాష్ట్రంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి ఆ ఉపసంఘం ఇచ్చిన అధ్యయన నివేదిక ఆధారంగా కొత్త బార్ల పాలసీ అమలుకు శ్రీకారం చుట్టనుంది.ఈ పాలసీలో భాగంగా గీత కార్మికులకు 10 శాతం షాపులు కేటాయించనున్నారు. కొత్త బార్ పాలసీపై అబ్కారీ శాఖ దాదాపుగా కసరత్తు పూర్తి చేసింది. త్వరలో కొత్త బార్‌లకు నోటిఫికేషన్ వెలువడనుంది.



జగన్ హయాంలో ఇచ్చిన బార్‌ల లైసెన్స్‌లకు ఈ నెలాఖరుతో కాల పరిమితి ముగుస్తుంది. దీంతో ఈనెల 15వ తేదీలోగా కొత్త బార్‌లకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్‌లు అందుబాటులోకి రానున్నాయి. మద్యం దుకాణాల కేటాయింపులో గీతకార్మికులకు ప్రభుత్వం 10 శాతం షాపులు కేటాయించింది. వీరికి లైసెన్స్ ఫీజు సైతం భారీగా తగ్గించింది. త్వరలో బార్ల లైసెన్సుల్లోను పది శాతం కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించింది. జగన్ జమానాలో పిచ్చి బ్రాండ్లతో ఎంత ఆదాయం వచ్చిందో.. ఇప్పుడు దాదాపు 200 రకాల నాణ్యమైన బ్రాండ్లు ఉన్నా అంతే రాబడి నమోదవుతోంది. బీర్లలో పెరుగుదల కనిపిస్తే ఆ మేరకు మిగతా మద్యం బ్రాండ్లలో తరుగుదల నమోదవుతోంది.దీంతో ఆదాయం ఆశాజన కం గా ఉండడం లేదు. దీనిపై ప్రభుత్వం విశ్లేషణ చేయగా పర్మిట్ రూమ్‌లు లేకపోవడమే ఒక కారణమని తేలింది. ప్రస్తుతానికి అనధికారిక సిట్టింగ్‌లను చూసీచూడ నట్టు వదిలేస్తున్నా.. ఆదాయం మెరుగుపడడం లేదు.బార్‌ల లైసె న్స్‌ల మాదిరిగానే పర్మిట్ రూంలకు ఈ సెప్టెంబరు నుంచి అనుమతులిచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది. జిల్లాల్లో2019కి ముందు అన్ని షాపులకు ఏడాదికి రూ.5 లక్షలు ఫీజుగా ఉండేది. ఇప్పుడు దానిని రెండు కేటగిరీలుగా చేయనున్నారు. మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.7.5 లక్షలు, మిగతా ప్రాంతాల్లో రూ.5 లక్షల ఫీజు విధించే అవకాశం ఉంది.
మద్యం షాపుల తరహాలోనే బార్లకు లాటరీ తీయాలని ప్రభుత్వం యోచిస్తోంది. జగన్ హయాంలో వేలం విధానంలో రెండేళ్ల పరిమితికి జారీ చేసిన లైసెన్స్‌లను గడువు ఈ నెల 31వ తేదీతో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త బార్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. లైసెన్స్ ఫీజుల నిమిత్తం రెండు ప్రతిపాదనలను ఎ-కై-÷-సజ్ శాఖ సిద్ధం చేసింది. నగర పంచాయతీల్లో రూ.35 లక్షలు, మునిసిపాలిటీ-ల్లో రూ.40 లక్షలు, నగరపాలక సంస్థల పరిధిలో రూ.45 లక్షలు మొదలు ప్రతిపాదన కాగా.. వరుసగా రూ.55 లక్షలు, రూ.65 లక్షలు, రూ.75 లక్షలు రెండో ప్రతిపాదనగా ప్రభుత్వం ముందుంచింది. అయితే ఖచ్చితంగా ఒక్కొక్క బారుకు నాలుగు దరఖాస్తులు పడాల్సిందేనన్న నిబంధన ఉంది. ప్రభుత్వం మొదటి ప్రతి పాదనకు మొగ్గు చూపుతుండగా ఆదాయం తగ్గుతుండడంతో ఏంచేయాలో ప్రశ్నార్థకంగా మారింది.

# సంక్షేమ పథకాలపై సుప్రీంకోర్టు కీలకతీర్పు



న్యూఢిల్లీ, **ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:** సంక్షేమ పథకాల్లో సీఎం ఫొటోను వినియోగించే విషయంలో సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పును వెలువరించింది. ఇదే అంశంపై మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు తోసిపుచ్చుతూ తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి భారీ ఊరట కల్పించింది. జులై 31న ఇచ్చిన తన ఉత్తర్వులో సంక్షేమ పథకాల్లో ప్రస్తుత, మాజీ ముఖ్యమంత్రుల ఫొటోలను ఉపయోగించకూడదని డీఎంకే ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ అయిన ఏఐఏడీఎంకే నాయకుడు సీవీ షణ్ముగంకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్ వీ అంజరియాలతో కూడిన ధర్మాసనం రూ.10 లక్షల జరిమానా విధించింది. తమిళనాడు సంక్షేమ పథకాలలో ముఖ్యమంత్రి పేరును ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ సరికాదని, చట్టపరమైన ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని సుప్రీంకోర్టు పేర్కొంది. రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం సంక్షేమ పథకాల్లో సీఎం ఫొటోలను వినియోగించకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ మద్రాస్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన కోర్టు.. కొత్తగా తీసుకురానున్న సంక్షేమ పథకాల్లో ప్రస్తుతం జీవించి ఉన్న నాయకుల పేర్లు వాడొద్దని.. పథకాలపై ప్రచారం చేసుకునే సమయంలో మాజీ సీఎంల ఫొటోలు, పార్టీ జెండాలను ఉపయోగించకుండా నిషేధం విధించింది. దీన్ని సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారించిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఎన్నో రాష్ట్రాల్లో నాయకుల పేర్లతో పథకాలు ప్రవేశపెట్టారని.. దీనిపై ఎలాంటి న్యాయపరమైన నిషేధాజ్ఞలు లేవని ధర్మాసనం ఎదుట తమిళనాడు ప్రభుత్వం తెలిపింది. పిల్ దాఖలు చేసిన పిటిషనర్‌పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ విషయంలో పిటిషనర్‌కు ఆందోళన ఉంటే.. అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నేతలతో ఉన్న పథకాలను ఎందుకు సవాల్ చేయలేదని ప్రశ్నించింది. పలు పథకాలకు ప్రధాని, రాష్ట్రపతి, ప్రధాన న్యాయమూర్తుల ఫొటోలు ఉపయోగించుకోవచ్చని సుప్రీం గతంలో అనుమతి ఇచ్చిందని.. దేశవ్యాప్తంగా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారని.. రాజకీయ పోరాటాల కోసం కోర్టులను వేదికలు చేసుకోవద్దంటూ హెచ్చరిస్తూ పిటిషనర్‌కు రూ.10లక్షల జరిమానా విధించింది.

# నియోజకవర్గాలకు ‘ప్రోగ్రెస్ కార్డు’ రెడీ ..!

అమరావతి,**ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:**

అధికార పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం చంద్రబాబు ప్రోగ్రెస్ కార్డులు రెడీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి.. ఏడాది అయిన నేపథ్యంలో వచ్చే నెలలో నియోజకవర్గాల వారీగా.. ప్రోగ్రెస్ కార్డులను అందించాలని సీఎం చంద్రబాబు తాజాగా నిర్ణయించారు. ప్రస్తుతం ఈ ప్రక్రియను కేవలం టీడీపీకి మాత్రమే పరిమితం చేయాలని భావిస్తున్నారు. ఒకవేళ బీజేపీ, జనసేనలు కూడా ముందుకు వస్తే.. అందరికీ కలిపి ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వనున్నారు. అయితే.. దీనికి ఐదు అంచల్లో లక్ష్యాలను పెట్టుకున్నారు. వాటిని చేరుకున్న నియోజకవర్గాలకు ఏం, మధ్యస్తంగా ఉన్నవాటికి ఏ, మరింతగా పనులు సాగాల్సిన నియోజకవర్గాలకు బీ ప్రాతిపదికన సర్టిఫికెట్లను అందించనున్నారు.

1) నియోజకవర్గంలో అభివృద్ధి: ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రహదారుల నిర్మాణంలో నాణ్యతకు పెద్దపీట వేసిన నియోజకవర్గాలు దీనిలో ఉంటాయి. రహదారుల నిర్మాణం ద్వారా.. గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యాన్ని ప్రజలకు వివరించి.. వీటి ద్వారా ప్రజల సానుకూల పొందడాన్ని ప్రధానంగా దీనిలో చర్చిస్తారు. 2) సుపరిపాలన: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా .. ప్రజలకు చేరువైన ఎమ్మెల్యేల



గ్రాఫ్ ను పరిగణనలోకి తీసుకుంటారు. నిజానికి రాష్ట్రవ్యాప్తంగా 132 నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని చంద్రబాబు ఆదేశించారు. ఒక్క కుప్పం, మంగళగిరిని మాత్రమే మినహాయించారు. ఆయా నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని అనుసరించిన ఎమ్మెల్యేల పనితీరును అంచనా వేస్తారు. 3) కూటమి కలివిడి: కూటమి పార్టీల నేతలను కలుపుకొని పోవడాన్ని కూడా ఒక ప్రాతిపదికగా.. నియోజకవర్గాలకు.. మార్కులు వేస్తున్నారు. దీనిపై ఎప్పటి నుంచో చంద్రబాబు నాయకులకు చెబుతున్నారు. కలివిడి ముఖ్యమని దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పుడు దీనికి కూడా మార్కులు వేయనున్నారు. తద్వారా ఎక్కడైనా పొరపొచ్చాలు ఉంటే వాటిని సర్దుబాటు చేసుకునే అవకాశం ఇవ్వనున్నారు. 4) ప్రత్యర్థుల విమర్శలపై కౌంటర్: ప్రత్యర్థులు చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇచ్చే ఎమ్మెల్యేల జాబితా ఆధారంగా కూడా.. నియోజకవర్గాలకు మార్కులు కేటాయించనున్నారు. చాలా వరకు నియోజకవర్గాల్లో ప్రత్యర్థుల విషయంలో ఎమ్మెల్యేలు సైలెంట్‌గా ఉంటున్నారన్నది చంద్రబాబు చెబుతున్న మాట. ఇప్పుడు దీనిని కూడా నియోజకవర్గాలకు మార్కులు ఇచ్చే విషయంలో ప్రాతిపదికగా తీసుకుంటారు.

5) ఆరోపణలు: నియోజకవర్గాల్లో కొందరు ఎమ్మెల్యేలపై ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. దీనిని పరిహరించేందుకు కూడా ఈ ప్రోగ్రెస్ కార్డులు పనిచేయనున్నాయి. దీనికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటి నుంచి వచ్చే మూడు మాసాల కాలాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి ఏడాదిన్నర పూర్తయ్యాక.. ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీనిని బట్టి ఎమ్మెల్యేలు పనితీరు మార్చుకుంటారని చంద్రబాబు అంచనా వేసుకుంటున్నారు.

# హైదరాబాద్‌లో డికె శివకుమార్

## మర్యాదపూర్వకంగా కలిసిన రాజగోపాల్

హైదరాబాద్,**ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:** కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో బస చేసిన డికెతో ఓ ప్రైవేట్ హోటల్లో.. భేటీ అయ్యారు. రాజగోపాల్ రెడ్డి, డీకే శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అయితే తాజాగా రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి ఇస్తానంటేనే కాంగ్రెస్‌లోకి వచ్చా అని తెలిపారు. కాంగ్రెస్‌లో తనని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరి ఎంపీని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు చెప్పారని కుండబద్దలు కొట్టారు. ప్రజల కోసం మరోసారి పదవీ త్యాగాని-కై-నా రెడీ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే గత కొన్నిరోజులుగా.. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై రాజగోపాల్ రెడ్డి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్, రాజగోపాల్ రెడ్డిల భేటీ- ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే గురువారం డీకే శివకుమార్, సీఎం రేవంత్ రెడ్డిని కలవనున్నట్లు- సమాచారం.

# సంధ్యథియేటర్ తొక్కిసలాట ఘటన

## తెలంగాణ సిఎస్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసు

హైదరాబాద్,**ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:** అల్లు అర్జున్ పుష్ప-2' సినిమా విడుదల సందర్భంగా హీరో అల్లు అర్జున్ అతిథిగా వచ్చారు. దీంతో తమ అభిమాన హీరోను చూస్తేందుకు వేల సంఖ్యలో ఫ్యాన్స్ అక్కడకు వచ్చారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగి.. ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. తాజాగా ఈ ఘటనకు సంబంధించి తెలంగాణ సిఎస్‌కు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సంధ్య థియేటర్ ఘటన దర్యాప్తుపై ఎన్‌హెచ్‌ఆర్‌సి అసహనం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై పోలీసులు సమర్పించిన నివేదికపై అసంతృప్తి తెలిపింది. బాధిత కుటు-ంబానికి పరిహారం రూ.5 లక్షలు

ఇచ్చేలా ఆదేశాలు ఎందుకు ఇవ్వకూడదో చెప్పాలని కమిషన్ అడిగింది. షోకు పోలీసులు అనుమతి లేదని రిపోర్టులో తెలిపారని.. అనుమతి లేకుంటే నటు-డు, అభిమానులు ఎందుకు వచ్చారో తెలియట్లేదు అని పేర్కొంది. ముందే చర్యలు తీసుకుంటే తొక్కిసలాట జరిగేది కాదని తెలిపింది. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి ఆరు వారాల్లో మరో నివేదిక ఇవ్వాలని.. దర్యాప్తు నిష్పక్షపాతంగా చేయాలని హైదరాబాద్ సిపికి ఆదేశాలు జారీ చేసింది.

# జివిఎంసిలో వైకాపాకు షాక్

## స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి గెలుపు

## 10 స్థానాల్లో కూటమికి 9..వైకాపాకు ఒకటి

విశాఖపట్నం,**ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:** విశాఖపట్నం మహా నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్, డిప్యూటీ- మేయర్ పీఠాలను ఇప్పటికే కూటమిలోని పార్టీలు కైవసం చేసుకోగా, బుధవారం తాజాగా జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల ఫలితాల్లో సైతం మెజార్టీ స్థానాలు కూటమిలోని పార్టీ అభ్యర్థులకే దక్కాయి. మొత్తం 10 స్థానాల్లో తొమ్మిది కూటమి.. కేవలం ఒక్క స్థానం మాత్రం వైసీపీకి దక్కింది. అంటే 8 స్థానాల్లో టీడీపీ, ఒక్క స్థానంలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. వైసీపీ అతి కష్టం మీద ఈ సీటును గెలుచుకుందని తెలుస్తోంది. ఇక ఈ జీవీఎంసీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగిందని వైసీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అయితే గతేడాది స్టాండింగ్ కమిటీ- ఎన్నికలలో కూటమి క్లీన్ స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. కానీ ఈ సారి మాత్రం కూటమి తొమ్మిది స్థానాలను -కై-వసం చేసుకుంది. ఈ రోజు ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 వరకు ఈ ఓటింగ్ ప్రక్రియ జరిగింది. ఈ ఎన్నికల్లో మొత్తం 92 మంది తమ ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. అయితే ఈ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగినట్లు- తెలుస్తుంది. అందుకే వైసీపీ ఘన విజయం సాధించిందనే వాదన వినిపిస్తోంది. ఎందుకంటే.. గతేడాది జరిగిన ఇవే ఎన్నికల్లో 10కి 10 స్థానాలు కూటమిలోని పార్టీలు గెలుచుకున్నాయి. కానీ ఈ సారి ఒక స్థానాన్ని కూటమి కోల్పోయింది. ఇక ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందడంతో కార్పొరేషన్ కార్యాలయం వద్ద పండగ వాతావరణం నెలకొంది. అలాగే ఒక్క స్థానాన్ని ఎందుకు కోల్పోయామనే అంశంపై సైతం సమీక్షించు కుంటామని కూటమిలోని పార్టీల నేతలు పేర్కొన్నారు. దీంతో జీవీఎంసీలో కూటమి పార్టీల ఆధిపత్యం కొనసాగుతున్నట్లు అయింది.

-------------

# బసి బిల్లును రాష్ట్రపతి ఆమోదిస్తే గొప్ప ముందడుగు

## ఎక్స్ వేదికగా రాహుల్ వెల్లడి

న్యూఢి÷-లీ,**ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:** కులగణన ఆధారంగా సామాజిక న్యాయం కోరుతున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దిల్లీలో తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బీసీ ధర్నాపై ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలనే డిమాండ్‌తో ధర్నా జరిగినట్లు చెప్పారు. కాంగ్రెస్ మహాధర్నాకు రాష్ట్రపతి స్పందిస్తారని ఆశిస్తున్నా. బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదిస్తే గొప్ప ముందడుగు అవుతుంది. ఈ పోరాటం కేవలం తెలంగాణ కోసమే కాదు.. దేశంలోని అణగారిన వర్గాలందరి కోసం. ఈ ధర్నాకు హాజరైన ఇండియా కూటమి నేతలకు ధన్యవాదాలని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

-----------

# ‘ఆంధ్రా ఈజ్ బ్యాక్’ అనే విధంగా సీఐఐ సదస్సును విజయవంతం చేయాలి

## ‘సోలార్, విండ్ ఎనర్జీ టాలెంట్ హబ్ గా ఆంధ్రప్రదేశ్’ అనే అంశంపై సదస్సు

## విజయవాడ నోవాటెల్ హెూటల్ లో కార్యక్రమం -ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేశ్

అమరావతి,**ఆగస్టు 6 ఆంధ్ర ప్రగతి:**
మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా భవిష్యత్ లో అద్భుతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విజయవాడ నోవాటెల్ హెూటల్ లో ‘సోలార్, విండ్ ఎనర్జీ టాలెంట్ హబ్ గా ఆంధ్రప్రదేశ్’ అనే అంశంపై ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, స్వనీతి ఇనీషియేటివ్ సంయుక్తంగా నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్ కు మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కాన్ఫరెన్స్ కేవలం దేశ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ ను శక్తివంతం చేయడం, సౌర, పవన శక్తికి నైపుణ్య హబ్ గా ఏపీని తీర్చిదిద్దడమే కాదు.. ప్రపంచ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ ను శక్తివంతం చేసే దిశగా ఈ కాన్ఫరెన్స్ ను నిర్వహించడం జరుగుతోంది. తద్వారా మన యువతకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి అని వెల్లడించారు.

### దేశంలో ఏ పార్టీకి ఈ రికార్డు లేదు!

దేశంలో ఏ పార్టీ సాధించని విధంగా కూటమి ప్రభుత్వం 94 శాతం స్ట్రైక్ రేట్ తో 164 సీట్లను కైవసం చేసుకోవడం జరిగింది. కూటమి ప్రభుత్వంలో




ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. ఇందుకోసం అందరం కష్టపడి పనిచేస్తున్నాం. ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. క్లస్టర్ విధానంలో పెట్టుబడులను ఆకర్షిస్తాం. ఇందుకు కావాల్సిన ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం. అనంతలో ఆటోమొబైల్, కర్నూలు రెన్యువబుల్ ఎనర్జీ, కడప, చిత్తూరును ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గా, నెల్లూరులో ఎయిర్ కండిషనర్స్ వంటి స్పెషలైజ్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ప్రకాశం జిల్లాను సీబీజీ హబ్ గా, గుంటూరు, కృష్ణాను క్యాంటమ్ వ్యాలీ హబ్ గా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను ఆక్వా హబ్ గా, ఉత్తరాంధ్రను ఫార్మా, డేటా సెంటర్, ఐటీ హబ్ గా, మెడికల్ డివైస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ గా తయారు చేస్తాం. ప్రతి వంద కిలోమీటర్లకు ఓ క్లస్టర్ ఏర్పాటుచేసి ఆయా రంగాల్లో టాప్ 20 కంపెనీలను తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నాం. దీంతో పాటు నైపుణ్యం పెంపు, నవీన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది.

### సెప్టెంబర్ 1వ తేదీన నైపుణ్యం పోర్టల్ ను ప్రారంభిస్తాం

రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ప్రైవేటు సెక్టార్ తో నైపుణ్యం గల యువతను అనుసంధానించాల్సిన అవసరం ఉంది. సెప్టెంబర్ 1న నైపుణ్యం పోర్టల్ ను ప్రారంభించడం జరుగుతోంది. స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, సీడాప్ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తాం. ప్రపంచ అవసరాలకు అనుగుణంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రపంచవ్యాప్తంగా అనేక అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రం చొరవ తీసుకుని యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తాం. అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతను సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. నా ఛాలెంజ్ ను స్వీకరించి సుజ్లాన్ సంస్థ ఇప్పటికే 2 నైపుణ్య శిక్షణా కేంద్రాలను నిర్మించింది. అవి ఇప్పటికే పనిచేస్తున్నాయి.

### గ్రీన్ ఎనర్జీ రంగం ద్వారా యువతకు విస్తృత అవకాశాలు

గ్రీన్ ఎనర్జీ రంగం ద్వారా మహిళలకు వారి గ్రామాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యువగళం పాదయాత్ర సమయంలో అనంత జిల్లాలోని కియా యాన్సిలరీ యూనిట్స్ లో మహిళలు పనిచేయడం చూశాను. ఓ మహిళ నా వద్దకు వచ్చి నాతో పాటు నడిచారు. ఏం చేస్తున్నారని ఆ మహిళను ప్రశ్నించగా.. తాను కియా యాన్సిలరీ యూనిట్స్ లో పనిచేస్తున్నానని, గతంలో సాధారణ గృహిణిగా ఉన్న తాను ఇప్పుడు నెలకు రూ.40 వేలు సంపాదిస్తూ కుటుంబానికి అండగా నిలిచానని గర్వంగా చెప్పారు. ఇప్పుడు కుటుంబంలో తనకు ఎంతో గౌరవం దక్కుతోందని చెప్పారు. ఒక్క కియా పరిశ్రమ వల్ల అనంతపురం జిల్లాలో వచ్చిన మార్పు ఇది. గ్రీన్ ఎనర్జీ రంగంలో కూడా విస్తృత అవకాశాలు ఉన్నాయి. అందుకే విండ్, సోలార్, రెన్యువబుల్, పంప్డ్ స్టోరేజీ, సీబీజీ ప్రాజెక్టులపై ప్రధానంగా దృష్టిసారించాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనపై గౌరవ సీఎం చంద్రబాబు గారు చాలా పట్టుదలతో ఉన్నారు. దీనిని చాలా ప్రాముఖ్యతగా తీసుకున్నాం. ఇందుకోసం ప్రైవేటు సెక్టార్ తో కలిసి పనిచేస్తాం. ఓంక్యాప్ ద్వారా యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం... అని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపిఎస్ఎస్ డిసి ఛైర్మెన్ బూరుగుపల్లి శేషారావు, ఎన్ఆర్ఈడీసీఏపీ వైస్ ఛైర్మెన్ కమలాకర్ బాబు, స్వనీతి ఇనీషియేటివ్ సీఈఓ రీత్వికా భట్టాచార్య పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# రాజకీయ పోరాటాల కోసం కోర్టును వాడుకోవద్దు

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ ప్రకటనల్లో ముఖ్యమంత్రి, మాజీ సీఎంలకు సంబంధించిన ఫొటోలు ఉండడం సర్వసాధారణమైన విషయమని, దానిని అనవసర రాద్ధాంతం చేసే ప్రయత్నాలు మానుకోవాలని సుప్రీం కోర్టు బుధవారం వ్యాఖ్యానించింది. ఈ క్రమంలో గతంలో తమిళనాడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మద్రాస్ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను, సదరు పిటిషన్‌నూ సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది.

'స్టాలిన్ విత్ యూ(ఉంగలదాన్' కార్యక్రమం విషయంలో అన్నాడీఎంకేకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ఆ ప్రకటనల్లో సీఎం ఫొటో, పేరు ఉండడంలో ఎలాంటి అభ్యంతరాలు లేవంటూ బుధవారం స్పష్టం చేసింది. గతంలో మద్రాస్ హైకోర్టు తమిళనాడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పును కొట్టేసింది. అలాగే పిటిషనర్ అయిన అన్నాడీఎంకే సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు వీసీ షణ్ముగంకు రూ.10 లక్షల జరిమానా విధిస్తూ మందలించింది.

మద్రాస్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఓ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌ను విచారణ జరిపిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం.. సంక్షేమ పథకాల ప్రచారంలో సీఎం ఫొటో వాడడం తప్పేం కాదని స్పష్టం చేసింది. చాలా రాష్ట్రాల్లో ఇది జరుగుతోందని గుర్తు చేసింది. అలాగే గతంలో అన్నాడీఎంకే ప్రభుత్వం కూడా ఇదే తరహాలో పథకాలను కొనసాగించిన తీరుపైనా ప్రశ్నలు గుప్పించింది. ఈ క్రమంలో పిటిషనర్ అన్నాడీఎంకే నేత అయిన షణ్ముగంను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. బతికి ఉన్న వ్యక్తులతో పాటు మాజీ సీఎంలు, పార్టీ నేతలు, పొలిటికల్ పార్టీల పేర్లను సంక్షేమ పథకాలకు పెట్టొద్దని, అందుకు సంబంధించిన ఫొటోలను కూడా వినియోగించవద్దని గతంలో






షణ్ముగం పిటిషన్ ఆధారంగానే మద్రాస్ హైకోర్టు తీర్పు వెల్లడించింది. అయితే సుప్రీం కోర్టు మాత్రం ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది.. "కేవలం ఒక నేతను, ఒక పార్టీనే పిటిషనర్ లక్ష్యంగా చేసుకోవడం వెనుక ఉద్దేశాలు మేం అర్థం చేసుకోగలం. ఒకవేళ రాజకీయ నిధుల దుర్వినియోగంపై గనుక పిటిషనర్ ఆందోళన చెందితే.. ఆ పథకాల విషయంలో ఆయన కోర్టును ఆశ్రయించొచ్చు. కానీ, ఆయన అలా చేయలేదు. పైగా తన అభ్యంతరాలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లిన మూడు రోజులకే ఆయన హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ పోరాటాల కోసం కోర్టును వాడుకోవద్దు. అందుకే కింది కోర్టులో ఆయన వేసిన పిటిషన్‌నూ(ఇంకా విచారణ దశలో ఉంది కాబట్టి) మేమే కొట్టిపారేస్తున్నాం" అని సీజే బెంచ్ వ్యాఖ్యానించింది. వారం లోగా తాము విధించిన ఈ సొమ్మును ప్రభుత్వానికి జమ చేయాలని షణ్ముగాన్ని.. అదే సమయంలో ఆ సొమ్మును పేద ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని తమిళనాడు ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. ఈ పిటిషన్‌కు సంబంధించిన సుప్రీం కోర్టులో డీఎంకే ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ పీఎస్ రామన్‌తో పాటు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, డాక్టర్ ఏఎం సింఘ్వీలు హాజరయ్యారు. అన్నాడీఎంకే తరపున సీనియర్ న్యాయవాది మణిందర్ సింగ్ వాదనలు వినిపించారు.

# అందువల్లే మోదీ ట్రంప్ వ్యాఖ్యలకు అడ్డు చెప్పట్లేదు

**ఇంటర్నెట్‌డెస్క్:** భారత్‌పై గణనీయంగా టారిఫ్‌లు పెంచుతానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు దిగిన సంగతి తెలిసిందే. వీటిపై ప్రధాని మోదీ మౌనంగా ఉండటంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ఈసందర్భంగా మోదీ చేతులు కట్టేశారంటూ ఎద్దేవా చేశారు. అమెరికాలో అదానీపై విచారణ జరుగుతుంది కాబట్టి.. టారిఫ్‌లపై ట్రంప్ పదేపదే బెదిరింపులకు పాల్పడినా మోదీ మౌనంగా ఉండిపోయారని రాహుల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ విషయాన్ని దేశ ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. మోదీ, అదానీ, అంబానీలను ఉద్దేశిస్తూ రష్యా చమురు ఒప్పందాల ఆర్థిక వ్యవహారాలు బయటపడతాయని వ్యాఖ్యానించారు. మోదీ చేతులు కట్టేశారంటూ విమర్శించారు. రష్యాతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తుండటంతో భారత్‌పై ట్రంప్ మండిపడుతున్నారు. ఇప్పటికే 25శాతం సుంకాలతో పాటు పెనాల్టీలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈక్రమంలోనే భారత్ మంచి భాగస్వామి కాదంటూ టారిఫ్‌లను గణనీయంగా పెంచుతానని మరోసారి హెచ్చరికలు చేశారు. అయితే, ఆయన వ్యాఖ్యలను భారత్ తిప్పికొట్టింది. అమెరికా కూడా మాస్కో నుంచి దిగుమతులు చేసుకుంటున్న విషయాన్ని గుర్తుచేసింది. రసాయనాలు, ఎరువులు వంటివి కొనుగోలు చేస్తోందని దుయ్యబట్టింది.



అలాంటప్పుడు భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడం అసంబద్ధం అని స్పష్టంచేసింది. మరోవైపు.. ట్రంప్ హెచ్చరికలపై మోదీ స్పందించకపోవడంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్‌తో మోదీ కౌగిలింతల దౌత్యం కుప్పకూలిందంటూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

# ఆ ఓటర్ల వివరాలు వెల్లడించండి: ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ:** బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ తర్వాత సుమారు 65 లక్షల మంది ఓటర్లను లిస్టు నుంచి తొలగించిన విషయం తెలిసిందే. అయితే డిలీట్ చేసిన ఆ 65 లక్షల ఓటర్ల వివరాలను వెల్లడించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఇవాళ సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆగస్టు 12 లేదా 13వ తేదీల్లో బీహార్ సిర్ ప్రక్రియపై సుప్రీంకోర్టులో మళ్లీ విచారణ జరగనున్నది. ఈ నేపథ్యంలో తొలగించిన ఓటర్ల వివరాలను బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు చెప్పింది. జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్వల్ భూయాన్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. డిలీట్ చేసిన ఓటర్ల వివరాలను ఇప్పటికే రాజకీయ పార్టీలకు సమర్పించారని, అయితే ఆ వివరాలను బహిరంగంగా వెల్లడించాలని, ఈ కేసులో పిటీషన్ వేసిన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్‌కు కూడా ఓ కాపీని ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. శనివారం లోగా రిప్లై నమోదు చేయాలని, ఏడీఆర్‌కు చెందిన ప్రశాంత్ భూషణ్ దాన్ని పరిశీలిస్తారని, అప్పుడు ఏ విషయాన్ని వెల్లడించాలి, వెల్లడించకూడదో తెలుస్తుందని బెంచ్ తెలిపింది. డిలీటైన 65 లక్షల ఓటర్లు మరణించార లేక శాశ్వతంగా ఇండ్లు మారారా.. అన్న కారణాలు వెల్లడిస్తూ జాబితాను రిలీజ్ చేయాలని ఏడీఆర్ తన






అప్లికేషన్‌లో కోరింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు ఇచ్చింది. డిలీట్ చేసిన లిస్టులో ఉన్న కనీసం 15 మంది బ్రతికి ఉన్నట్లు నిరూపిస్తే, ఈ కేసును తీవ్రంగా పరిగణిస్తామని కోర్టు చెప్పింది.

# ఉచిత బస్సుల్లో చార్జీల వసూలా..?

**సామాజిక మాధ్యమాల్లో ఓ మహిళ పోస్ట్**

**తమిళనాడు ప్రభుత్వం వివరణ**

అన్నానగర్: తమిళనాడు ప్రభుత్వం 'విడియల్ ప్రయాణం' పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా మహిళలు సాధారణ ఛార్జీల సిటీ బస్సులలో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఈ స్థితిలో మహిళలు ప్రయాణించడానికి ఛార్జీలు లేవని రాసి ఉన్న బస్సు నుంచి డబ్బు తీసుకొని పురుషులకు మహిళలకు టిక్కెట్లు ఇస్తున్నారు. ఇది ఏమిటి? అని ఓ మహిళ తన సోషల్ మీడియా పేజీలో టికెట్‌తో పోస్ట్ చేసింది. తిరుచ్చి నుంచి ముసిరి వరకు పురుషుడికి రూ. 42, ఇద్దరు వ్యక్తులకు రూ. 84 అని అందులో పేర్కొంది. చాలా మంది దీనిని షేర్ చేశారు. కొందరు తమిళనాడు ప్రభుత్వాన్ని కూడా విమర్శించారు. దీని తరువాత, తమిళనాడు ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఈ విషయంలో, తమిళనాడు ప్రభుత్వ అధికారిక సోషల్ మీడియా ఖాతా ఫ్యాక్ట్ చెకింగ్ ఆఫీస్ ఓ పోస్ట్‌ను పోస్ట్ చేసింది. ఆ ఫోటోలో ఉన్న బస్సు విడియాల్



ట్రావెల్ స్కీమ్ కింద ఉన్న బస్సు కాదు. ఇది తిరుచ్చి నుంచి ముసిరికి వెళ్లే %-%4 సబర్బన్ బస్సు (నీలం రంగు). దీనికి ప్రయాణ రుసుము ఉంది. ఎలక్ట్రానిక్ టికెట్‌లో ప్రయాణికుల వివరాలు స్త్రీ అని కాకుండా పురుషుడు అని పేర్కొంటూ బస్సు కండక్టర్ పొరపాటున టికెట్ జారీ చేశారని బిజినెస్ పార్ట్‌నర్‌షిప్ (సేలం సబర్బన్ బస్) డిప్యూటీ మేనేజర్ తెలిపారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని అని సూచించారు.

# ఉత్తరకాశి ఘటనపై బాబు దిగ్భ్రాంతి



అమరావతి,ఆగస్ట్6: ఉత్తరకాశీలో సంభవించిన విపత్తు తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చాలా మంది ప్రాణాలు కోల్పోయి, గల్లంతయ్యారని తెలిసి ఆవేదనకు గురైనట్టు- తెలిపారు. మృతుల కుటు-ంబాలకు సానుభూతి తెలిపారు. తప్పిపోయినవారు సురక్షితంగా తిరిగి రావాలని ప్రార్థిస్తున్నట్టు- 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఒక్కసారిగా విరుచుకుపడ్డ ఆకస్మిక వరదలతో ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశీ అల్లకల్లోలమైంది. గంగోత్రికి వెళ్లే మార్గంలో ఉన్న ధరాలీ గ్రామం సగభాగం తుడిచిపెట్టు-కుపోయింది. అక్కడి ఇళ్లు, కార్లు, చెట్లు- వరదల్లో కొట్టు-కుపోయాయి. 60 నుంచి 70 మంది ఈ వరదల్లో చిక్కుకుపోయారు. కనీసం నలుగురు మరణించారు. మరో 12 మందిదాకా శిథిలాల కింద ఉండి ఉంటారని భావిస్తున్నారు.

--------------

# లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం

**విచారణకు చెవిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, శివా రెడ్డి హాజరు**

విజయవాడ,ఆగస్ట్6: లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. లిక్కర్ స్కాం కేసులో సిట్ ఎదుట విచారణకు చెవిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివా రెడ్డి హాజరయ్యారు. లిక్కర్ స్కాం కేసులో మిథున్ రెడ్డి అరెస్టు తరువాత ఈ సంస్థ ప్రతినిధులను విచారణకు హాజరు కావాలని సిట్ నోటీసులు ఇచ్చింది. ఈ మేరకు వారు బుధవారం విచారణకు హాజరయ్యారు. లిక్కర్ స్కాం కేసులో వీరి సంస్థ ఖాతాల్లోకి డబ్బు బదిలి అయినట్లు- వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. ఈ విషయంపై ర ప్రాజెక్ట్స్ బ్యాంక్ లావాదేవీలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకుంటు-న్నారు సిట్ అధికారులు. లిక్కర్ స్కామ్ కేసులో మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై నిన్న వాదనలు ముగిశాయి. ఇరువైపు వాదనలు విన్న ఏసీబీ కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు ఈ నెల 12వ తేదీ బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేయనుంది. అయితే లిక్కర్ స్కామ్ కేసులో ఏ4గా మిథున్ రెడ్డి ఉన్న సంగతి తెలిసిందే. ఇదే కేసులో అరెస్టయిన ఆయన.. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

------

# ఎపిలో పలువురు మున్సిపల్కమిషనర్ల బదిలీ

అమరావతి,ఆగస్ట్6: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీలు, నియామకాలు చేపట్టింది. మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ గా ఎస్.రవీంద్ర బాబును నియమించింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న పలువురు అధికారులను కమిషనర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాయచోటి మున్సిపల్ కమిషనర్ ఎన్. వాసు బాబును నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ టీ-పీఆర్వోగా నియమించింది. రాయచోటి మున్సిపల్ కమిషనర్ గా జి. రవి, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ గా పి. భవానీ ప్రసాద్, శ్రీకాకుళం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ- సెక్రటరీ గా ఎల్ . సురేష్ లను నియమించింది. అలాగే సాలూరు మున్సిపల్ కమిషనర్ గా టి.టి.రత్నకుమార్, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ- సహాయ కమిషనర్ గా డి. కొండయ్యలను నియమించింది. కదిరి మున్సిపాలిటీ- శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి ప్రహ్లాద్ ను కమలాపురం మున్సిపల్ కమిషనర్ పోస్టుకు బదిలీ చేస్తూ.. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ దిశగా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ను ఆదేశించారు.

## ఏఐతో ఉద్యోగాలు పోవు

**ముంబై :** కృత్రిమ మేధస్సు భవిష్యత్తులో ఉద్యోగాలను కష్టతరం చేస్తుందని చాలా మంది భావిస్తుంటే, ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష్ గోయెంకా మాత్రం దీనిపై భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఏఐ కేవలం ఉద్యోగాలను



తీసివేయదని.. బదులుగా పని తీరును పూర్తిగా మెరుగు పరిచి.. సరికొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని తెలిపారు. ఈ విషయమై ఆయన సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఈ మార్పుకు అనుగుణంగా మనం సిద్ధంగా ఉండాలని, నైపుణ్యాలను పెంచుకోవాలని ఆయన యువతకు సూచించారు.ఆర్‌పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గోయెంకా ఎక్స్ వేదికగా చేసిన తన పోస్ట్‌లో.. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందనే అంతా ఆందోళన చెందుతున్నారని గుర్తు చేశారు. కానీ ఏఐ ప్రస్తుతం జరుగుతున్న పనిని మార్చేసి అందులో నూతనత్వం తీసుకు వస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏఐ కారణంగా భవిష్యత్తులో మూడు ప్రధాన కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని స్పష్టం చేశారు. అందులో ఒకటి ప్రాంప్ట్ ఇంజనీర్, రెండోది ఏఐ ప్రొడక్ట్ మేనేజర్, మూడోది ఏఐ ఎథిక్స్ స్పెషలిస్ట్ అని తెలిపారు. అలాగే కార్యాలయాలు నేటిలా కాకుండా వాటి రూపురేఖలే పూర్తిగా మారిపోయే అవకాశం ఉందన్నారు. స్మార్ట్ వర్క్ చేసేవారు వీటిలో బాగా రాణిస్తారని.. అభిప్రాయం వ్యక్తం చేశారు.ప్రస్తుతం గోయెంకా చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్ కావడంతో.. అనేక మంది స్పందిస్తున్నారు. తమ మనసులోని భావాలను కామెంట్ల రూపంలో వెల్లడిస్తున్నారు. చాలా మంది నెటిజన్లు ఏఐ భవిష్యత్తుపై ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక నెటిజన్.. "ఏఐ ఉద్యోగాలను తగ్గిస్తుందని భయపడటం సరికాదు, అది కొత్త మార్గాలను తెరుస్తుంది" అని పేర్కొన్నారు. మరొకరు ఏఐ వల్ల అన్ని రంగాల్లో ఉత్పాదకత పెరుగుతుందని, తద్వారా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెంది కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని అభిప్రాయపడ్డారు.వెంచర్ క్యాపిటలిస్ట్ వినోద్ ఖోస్లా లాంటి ప్రముఖులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఏఐ ట్యూటర్ల రాకతో సాంప్రదాయ కాలేజ్ డిగ్రీలకు ప్రాముఖ్యత తగ్గుతుందని.. వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా విద్య లభిస్తుందని ఆయన అంచనా వేశారు. మొత్తానికి భవిష్యత్ పని ప్రపంచంలో విజయం సాధించాలంటే ంఎకి అనుగుణంగా మారడం మరియు కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం అత్యంత అవసరం అని ఈ అభిప్రాయాలు స్పష్టం చేస్తున్నాయి.



# సిరాజ్ కెరీర్‌లో ఆల్‌టైమ్ బెస్ట్

## ఐసీసీ ర్యాంకింగ్స్ విడుదల

టీమ్‌ఇండియా స్టార్ పేస్ బౌలర్ మహ్మద్ సిరాజ్ టెస్టు ర్యాకింగ్స్‌లో సత్తా చాటాడు. రీసెంట్‌గా ఇంగ్లాండ్ పర్యటనలో అదిరే ప్రదర్శన చేసిన సిరాజ్, ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఏకంగా 12 స్థానాలు ఎగబాకాడు. ప్రస్తుతం 674 రేటింగ్ పాయింట్స్‌తో 15వ స్థానానికి దూసుకొచ్చాడు. కాగా, సిరాజ్ కెరీర్‌లో అతడికి ఇదే అత్యుత్తమ ర్యాంకు కావడం విశేషం. ఇదే ఏడాది జనవరిలో సిరాజ్ ర్యాంకింగ్స్‌లో 16వ స్థానం దక్కించుకున్నాడు. మరోవైపు, ఇంకో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ కూడా కెరీర్ బెస్ట్ ర్యాంక్ సాధించాడు. ఇంగ్లాండ్ టూర్‌లో 14 వికెట్లు పడగొట్టిన ప్రసిద్ధ్ ఏకంగా 25 స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. ప్రస్తుతం ప్రసిద్ధ్ 368 రేటింగ్స్‌లో 59వ ప్లేస్‌లో ఉన్నాడు. ప్రసిద్ధ్‌కు కూడా ఇదే కెరీర్ అత్యుతమ ర్యాంక్. కాగా, టీమ్‌ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఎప్పటిలాగే తన అగ్రస్థానం పదిలం చేసుకున్నాడు. 889 రేటింగ్స్‌తో బుమ్రా టాప్‌లోనే కొనసాగుతున్నాడు. కాగా, టాప్ 10లో భారత్ నుంచి బుమ్రా ఒక్కడే ఉన్నాడు.కాగా, సిరాజ్ ఇంగ్లాండ్ పర్యటనలో ఐదో టెస్టులో అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. ఒత్తిడిగా ఉన్న మ్యాచ్‌లో మొత్తం 9 వికెట్లు (4 తొలి ఇన్నింగ్స్, 5 రెండో ఇన్నింగ్స్) దక్కించుకొని ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు. ఇక ఈ సిరీస్‌లో ఓవరాల్‌గా 23 వికెట్లు నేలకూల్చాడు. అంతేకాకుండా ఎలాంటి వర్క్ లోడ్ లేకుండా సిరాజ్ ఈ సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడాడు. ఇరుజట్లలో పూర్తి స్థాయిలో ఐదు మ్యాచ్‌లు ఆడిన ఏకైక బౌలర్ సిరాజే కావడం విశేషం.ఇక బ్యాటింగ్ విభాగంలోకి యశస్వీ జైస్వాల్ మూడు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. 792 రేటింగ్ పాయింట్లతో జైస్వాల్ టాప్-5లోకి చేరుకున్నాడు. ప్రస్తుతం అతుడ ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. అలాగే రిషభ్ పంత్ (768 రేటింగ్స్) 8వ స్థానంలో, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (725 రేటింగ్స్) 13వ ప్లేస్‌సో కొనసాగుతున్నాడు. ఇంగ్లాండ్ సీనియర్ బ్యాటర్ జో రూట్ టాప్ ప్లేస్ పదిలం చేసుకున్నాడు. 908 రేటింగ్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఆల్‌రౌండర్ల లిస్ట్‌లో టాప్‌లోనే కొనసాగుతున్నాడు. 405 రేటింగ్స్‌తో జడేజా అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ సిరీస్‌లో జడేజా అద్భుతంగా రాణించాడు. బ్యాటింగ్‌లో 516 పరుగులు బాదిన జడ్డూ, బౌలింగ్‌లో 7 వికెట్లు తీసి సత్తా చాటాడు. ఈ లిస్ట్‌లో జడ్డూ తర్వాత మెహదీ హసన్ (305 రేటింగ్స్), బెన్ స్టోక్స్ (295 రేటింగ్స్), వియాన్ మల్డార్ (284 రేటింగ్స్), ప్యాట్ కమిన్స్ (270 రేటింగ్స్) వరుసగా ఉన్నారు.

### ఐదవ టెస్ట్‌లో సెంచరీ సాధించిన ఏకైక భారతీయ బ్యాట్స్‌మన్ యశస్వి జైస్వాల్



టెస్ట్ బ్యాటింగ్ ర్యాంకింగ్‌లో 3 స్థానాలు ఎగబాకాడు. అతను టాప్ 5లో చేరాడు, అతను ఇంతకు ముందు 8వ స్థానంలో ఉన్నాడు మరియు ఇప్పుడు 792 రేటింగ్‌తో ఐదవ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లాండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ ఒక స్థానం ఎగబాకి రెండో స్థానానికి చేరుకున్నాడు. నంబర్ 1 టెస్ట్ బ్యాట్స్‌మన్ కిరీటం జో రూట్ వద్దే ఉంది, అతను 5వ టెస్ట్‌లో సెంచరీ కూడా సాధించాడు. ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ 908 రేటింగ్ పాయింట్లతో టాప్ పాజిషన్ కొనసాగిస్తున్నాడు. ఇంగ్లాండ్ కే చెందిన హ్యారీ బ్రూక్ 2, కేన్ విలియమ్సన్ 3, స్టీవ్ స్మిత్ 4, యశస్వీ జైస్వాల్ 5వ స్థానాల్లో నిలిచారు. టెస్ట్‌లో నంబర్ 1 ఆల్ రౌండర్‌గా రవీంద్ర జడేజా కొనసాగుతున్నాడు. ఇంతకు ముందు 7వ స్థానంలో ఉన్న జో రూట్ ఇప్పుడు 8వ స్థానానికి పడిపోయాడు. గస్ అట్కిన్సన్ ఒక స్థానం ఎగబాకి 9వ స్థానానికి చేరుకున్నాడు. టాప్ 5 లో ఎలాంటి మార్పు లేదు. టెస్టు ఆల్ రౌండర్లలో జడేజా ఆదిపత్యం కొనసాగుతోంది. 405 రేటింగ్ పాయింట్లతో జడేజా నెంబర్ వన్ గా కొనసాగుతున్నాడు. రెండో స్థానంలో ఉన్న మెహదీ హసన్ కంటే ఏకంగా 100 రేటింగ్ పాయింట్లు అధికంగా జడేజా ఖాతాలో ఉన్నాయి. బెన్ స్టోక్స్ 3, వియాన్ ముల్డర్ 4, పాట్ కమిన్స్ 5వ స్థానాల్లో ఉన్నారు.

# బెన్ స్టోక్స్‌పై సచిన్ టెండూల్కర్ ఆగ్రహం

ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్‌పై టీమిండియా దిగ్గజం, క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్ -సచిన్ ట్రోఫీలో భాగంగా మాంచెస్టర్ వేదికగా జరిగిన నాలుగో టెస్ట్‌లో బెన్ స్టోక్స్ ప్రవర్తించిన తీరును తప్పుబట్టాడు. ఈ మ్యాచ్‌లో సెంచరీకి చేరువైన టీమిండియా ఆల్‌రౌండర్స్ వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజాలను డ్రాకు అంగీకరించాలని బెన్ స్టోక్స్ ఒత్తిడి చేశాడు. దానికి అంగీకరించకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేసిన బెన్ స్టోక్స్ నోరు పారేసుకున్నాడు. హ్యారీ బ్రూక్, బెన్ డకెట్ బౌలింగ్‌లో సెంచరీ చేస్తారా? అని హేళనగా మాట్లాడాడు. సెంచరీలు అనంతరం భారత్ డ్రాకు అంగీకరించినా.. జడేజాకు షేక్ హ్యాండ్ ఇవ్వకుండా స్టోక్స్ అసహనం వ్యక్తం చేశాడు. క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించిన స్టోక్స్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. తాజాగా ఓ




ఇంటర్వ్యూలో ఈ ఘటన గురించి మాట్లాడిన సచిన్.. బెన్ స్టోక్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ విషయంలో ముమ్మాటికి అతనిదే తప్పన్నాడు. ‘వాషింగ్టన్ సుందర్, జడేజా సెంచరీలు సాధించారు. ఇందులో క్రీడా స్ఫూర్తికి విరద్ధంగా ప్రవర్తించడం ఏం ఉంది? ఈ ఇద్దరూ డ్రా కోసం గొప్ప పోరాటం చేశారు. ఇంగ్లండ్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. అప్పటికీ సిరీస్ ఇంకా డిసైడ్ అవ్వలేదు. అలాంటి సమయంలో భారత ఆటగాళ్లు డ్రాకు ఎందుకు అంగీకరించాలి. ఇంగ్లండ్ ఆటగాళ్లకు వారు ఎందుకు విశ్రాంతి ఇవ్వాలి? హ్యారీ బ్రూక్‌తో బౌలింగ్ చేయాలనేది బెన్ స్టోక్స్ ఇష్టం. అది భారత్ సమస్య కాదు. నా వరకైతే జడేజా, సుందర్ చేసింది సరైనదే. వారు సెంచరీల కోసం కాకుండా డ్రా కోసం ఆడారు. ఆ పోరాటానికి ఫలితంగా శతకాలు దక్కాయి. వారు ఆరంభంలోనే ఔటై ఉంటే ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలిచేది కాదు. వారు బ్యాటింగ్‌కు వచ్చిన కొత్తలో హ్యారీ బ్రూక్ బౌలింగ్ చేయలేదు కదా..? ఇందుకు ఇంగ్లండ్ వద్ద సమాధానం ఉందా?ఈ విషయంలో భారత జట్టుకు 100 శాతం మద్దతు ఇస్తాను. అది గంభీర్, శుభ్‌మన్, జడేజా, వాషింగ్టన్ ఎవరైనా సరే.. వారికి నా మద్దతు ఉంటుంది. గత మ్యాచ్‌లో సుందర్ అద్భుతంగా ఆడాడు కదా? వేగంగా ఆడాల్సినప్పుడు ఆ బాధ్యతను పూర్తి చేశాడు.’అని సచిన్ ప్రశంసించాడు.



# ఆసియా కప్ కోసం భారత్ జట్టు

బ్యాట్స్‌మెన్లు: యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, శ్రేయాస్ అయ్యర్, తిలక్ వర్మ, రింకూ సింగ్.వికెట్ కీపర్లు: సంజు శాంసన్, ధ్రువ్ జురెల్.
ఆల్ రౌండర్లు: హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్.
బౌలర్లు: ప్రసిద్ధ్ కృష్ణ, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, మహ్మద్ సిరాజ్.

# బలమైన సంస్కృతిని పెంపొందించాలి



లండన్: నిరంతర కృషి, పురోగతితో బలమైన జట్టు సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరం ఉందని గంభీర్ సూచించాడు. ‘జట్టులోకి ఎంతోమంది వస్తుంటారు.. పోతుంటారు. డ్రెస్సింగ్ రూమ్ సంస్కృతే అందరినీ ఆకర్షిస్తుంద’ని ఐదో టెస్ట్ ముగిసిన అనంతరం ఆటగాళ్లతో గౌతీ అన్నాడు. 2-2తో సిరీస్ సమం చేయడం అద్భుతమని కొనియాడాడు. మన నైపుణ్యాలను సానబెట్టుకొంటూ సాగితే.. సుదీర్ఘకాలం ఆధిపత్యం ప్రదర్శించవచ్చన్నాడు. ఈ సందర్భంగా ‘ఇంపాక్ట్ ప్లేయర్’ అవార్డును సుందర్‌కు జడేజా అందజేశాడు.

# మహమ్మద్ సిరాజ్‌కు ఘనస్వాగతం



ఇంగ్లండ్ పర్యటనను ముగించుకొని హైదరాబాద్‌కు చేరుకున్న టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు ఘనస్వాగతం లభించింది. బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్న సిరాజ్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో అభిమానులు ఘన స్వాగతం పలికారు. భారీ ఎత్తున విమానాశ్రయానికి చేరుకున్న అభిమానులు.. సిరాజ్ భాయ్ సిరాజ్ భాయ్ అని గట్టిగా అరుస్తూ వెల్‌కమ్ చెప్పారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో సిరాజ్.. 185.3 ఓవర్లు వేసి 23 వికెట్లతో సత్తా చాటాడు. ఓవల్ వేదికగా ఐదు రోజుల పాటు ఉత్కంఠగా సాగిన ఆఖరి పోరులో మహమ్మద్ సిరాజ్(5/104) అద్వితీయమైన బౌలింగ్‌తో టీమిండియాను గెలిపించాడు.374 పరుగుల లక్ష్యఛేధనలో 339/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్.. సిరాజ్ ధాటికి 367 పరుగులకు ఆలౌటైంది. ఆఖరి రోజు ఆటలో ఇంగ్లండ్ విజయానికి 35 పరుగులే అవసరమవ్వగా.. సిరాజ్ సంచలన ప్రదర్శనతో జెమీ స్మిత్, జెమీ ఓవర్టన్, గస్ అట్కిన్సన్, జోష్ టంగ్‌లను పెవిలియన్ చేర్చాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 9 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ ప్రదర్శనతోనే ఐసీసీ ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ ర్యాంక్ అందుకున్నాడు. మహమ్మద్ సిరాజ్‌కు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసే యోచనలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఉంది. ఈ విషయాన్ని హెచ్‌సీఏ ప్రతినిధులు మీడియాకు తెలిపారు. ‘మేం ఇంకా సిరాజ్‌తో మాట్లాడలేదు. కానీ మేం అతని కోసం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తాం. అతను మరికొద్ది రోజులు హైదరాబాద్‌లోనే ఉండే అవకాశం ఉంది. ఇంగ్లండ్ పర్యటనలో దేశం తరఫున మెరుగైన ప్రదర్శన చేయడం మా అందరికీ గర్వకారణం’అని హెచ్‌సీఏ ప్రతనిధులు తెలిపారు.



# బాక్సింగ్‌లో మరో ఏడు పతకాలు ఖాయం

బ్యాంకాక్: ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిపలో మరో ఏడుగురు భారత మహిళా బాక్సర్లు సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి పతకాలు ఖరారు చేసుకున్నారు. మంగళవారం జరిగిన అండర్-19 పోటీల్లో యషిక (51 కిలోలు), నిష (54 కి), ముస్కాన్ (57 కి), విని (60 కి), నిషిక (65 కి), ఆకాంక్ష (70 కి), ఆర్తి కుమారి (75 కి) సెమీస్‌కు చేరారు.ం

# చెన్నై గ్రాండ్ మాస్టర్స్‌కు అర్జున్, హారిక

చెన్నై: గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసికి కఠిన పరీక్ష ఎదురయ్యే అవకాశం ఉంది. బుధవారం నుంచి రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో 9 రౌండ్లపాటు సాగే ఈ టోర్నీలో 19 మంది జీఎంలు పాల్గొననున్నారు. చాలెంజర్స్ విభాగంలో ద్రోణవల్లి హారిక, వైశాలి ఆడనున్నారు.



# రక్తదానం అనగానే నేను గుర్తుకు రావడం పూర్వజన్మ సుకృతం: చిరంజీవి



"రక్తదానం అనగానే నేను గుర్తొస్తున్నానంటే అది నా పూర్వజన్మ సుకృతం" అని మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు. ఫీనిక్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన బ్లడ్ డొనేషన్ డ్రైవ్ లో మాట్లాడుతూ చిరంజీవి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో తేజ సజ్జాతో కలిసి చిరంజీవి పాల్గొన్నారు. రక్తదానం గొప్పతనాన్ని వివరిస్తూ ఓ జర్నలిస్ట్ రాసిన ఆర్టికల్ చదివాకే బ్లడ్ బ్యాంక్ పెట్టాలనే ఆలోచన వచ్చిందని గుర్తుచేసుకున్నారు. ఆ జర్నలిస్ట్ కు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. బ్లడ్ డొనేషన్ క్యాంపుకు హాజరైన వారికి, రక్తదానం చేసిన వారికి చిరంజీవి కృతజ్ఞతలు తెలిపారు.


**రాజకీయాలకు దూరంగా ఉంటున్నా..**

కొంతకాలంగా తాను రాజకీయాలకు దూరంగా ఉంటున్నానని ఈ సందర్భంగా చిరంజీవి తెలిపారు. అయితే, ఇటీవల ఓ రాజకీయ నాయకుడు తనను అకారణంగా దూషించారని చెప్పారు. ఆ తర్వాత సదరు నాయకుడు ఓ ప్రాంతానికి వెళితే.. అక్కడ ఓ మహిళ ఆయనకు ఎదురు తిరిగిందని చెప్పారు. చిరంజీవిని ఎందుకు దూషించావంటూ ఆయనను నిలదీసింది. ఈ సందర్భంగా సదరు మహిళ భావోద్వేగానికి గురైందని చిరంజీవి తెలిపారు. ఆ వీడియో తనదాకా రావడంతో సదరు మహిళ ఎవరు.. ఎందుకు అంతగా భావోద్వేగానికి గురైందని ఆరా తీసినట్టు పేర్కొన్నారు. ఒకప్పుడు చిరంజీవి బ్లడ్‌బ్యాంక్ ద్వారా ఆమె బిడ్డ ప్రాణాలు నిలిచాయని, అందుకే తానంటే ఆమెకు గౌరవమని తెలిసిందని, ఆమె మాటలు విన్నాక తన హృదయం ఉప్పొంగిందని చిరంజీవి తెలిపారు.

**సోషల్ మీడియాలో ట్రోల్స్ పై..**

సోషల్ మీడియాలో విమర్శలపై ఎందుకు స్పందించరంటూ చాలామంది తనను అడుగుతుంటారని చిరంజీవి చెప్పారు. ఆ విమర్శలు, ట్రోల్స్ పై తాను స్పందించాల్సిన అవసరం లేదని, తాను చేసిన మంచి పనులే మాట్లాడతాయని వివరించారు. 'నేను చేసిన మంచి పనులు, నా అభిమానుల ప్రేమానురాగాలే నాకు రక్షణ కవచాలు' అని అన్నారు. "మనల్ని ఎవరైనా మాటలంటే మనం చేసిన మంచే సమాధానం చెబుతుంది. అందుకే నేను ఎప్పుడూ దేనికీ స్పందించను. నాలాగా మంచి చేసే నా తమ్ముళ్లకు సాయంగా ఉంటాను. ఇతర దేశాల్లో ఉన్న అభిమానులు కూడా నా మాటను స్ఫూర్తిగా తీసుకుని రక్తదానం చేస్తున్నారు. వాళ్లందరికీ అభినందనలు" అని చిరంజీవి పేర్కొన్నారు.

# జూనియర్ ఎన్టీఆర్ సినిమాకు భారీగా ధరలు




జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న వార్ 2 చిత్రం. ఈ సినిమా హిందీలో సాధారణ ధరలతో విడుదల కాబోతుండగా, డబ్బింగ్ వెర్షన్ తెలుగులో మాత్రం టికెట్ ధరలను నిర్మాతలు పెంచబోతున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రతి స్టార్ సినిమాకు పెరుగుతున్న టికెట్ ధరలతో పాటు, డబ్బింగ్ సినిమాలకు కూడా టికెట్ రేట్లు పెంచడం ప్రస్తుతం నెటిజన్ల ఆగ్రహానికి కారణమవుతోంది. ఎన్టీఆర్ నటిస్తున్న వార్ 2 సినిమాతో పాటు రజనీకాంత్ నటిస్తున్న కూలీ చిత్రాలు సొంత భాషల్లో సాధారణ టికెట్ ధరల్లోనే ప్రేక్షకులకు అందుబాటులోకి రాబోతుండగా.., తెలుగులో ఈ సినిమాలకు టికెట్ ధరలను పెంచబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇవే కాకుండా ఇంతకుముందు వచ్చిన చాలా తెలుగు సినిమాలకు కూడా టికెట్ ధరలను పెంచి జనాన్ని థియేటర్లకు రాకుండా చేస్తున్నారు నిర్మాతలు. దీంతో సోషల్ మీడియాలో ఈ అంశంపై తీవ్రమైన ట్రోలింగ్ జరుగుతోంది. "ఒకే సినిమా, ఒకే కంటెంట్, కానీ వేర్వేరు భాషలకు వేర్వేరు ధరలు ఎందుకు?" అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. "ఇది తెలుగు ప్రేక్షకులను దోచుకోవడమే" అని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో తెలుగు సినీ పరిశ్రమ స్పందించాల్సిన అవసరం ఉందని, లేకపోతే ప్రేక్షకులు సినిమా చూడటం మానేసి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లపై ఆధారపడటం పెరుగుతుందని నెటిజన్లు ఆరోపిస్తున్నారు. ఇది భవిష్యత్తులో తెలుగు సినిమా పరిశ్రమకు చాలా నష్టం కలిగించే అవకాశం ఉందని తెలుపుతున్నారు. గతంలో ఒక సినిమా టికెట్ ధర గరిష్టంగా రూ.150 నుండి రూ.200 వరకు ఉండేది. కానీ ఇప్పుడు కొత్తగా విడుదలయ్యే ప్రతి స్టార్ సినిమాకు టికెట్ ధరలు రూ.300 నుండి రూ.400 వరకు చేరుకున్నాయి. కొన్ని మల్టీప్లెక్స్‌లలో అయితే మొదటి వారం టికెట్ ధరలు రూ.500 వరకు కూడా పెంచుతున్నారు. ఈ ధరలు సామాన్య ప్రేక్షకుడికి చాలా భారంగా మారాయి. దీంతో కుటుంబంతో కలిసి సినిమా చూడాలంటే దాదాపు రూ.2 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తుంది.


# ఈడీ విచారణకు హాజరైన విజయ్‌దేవరకొండ



అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ ముందు విచారణకు హాజరయ్యాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో విచారణకు హాజరు కావాలని నటుడు ప్రకాశ్ రాజ్‌తో పాటు పలువురు నటులకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో గత నెల 30న ప్రకాశ్ రాజ్ హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఉన్న ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. అయితే నేడు విచారణకు రావాలని విజయ్‌కి నోటీసులు జారీ చేయగా.. తాజాగా అతడు ఈడీ ముందు విచారణకు హాజరయ్యాడు. తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు పలువురు సినీ సెలబ్రిటీలపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ యాప్‌ల ప్రమోషన్ ద్వారా పెద్ద ఎత్తున మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలోనే బెట్టింగ్ యాప్‌ల ప్రచారం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నటులకు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ఇప్పటికే హీరోలు ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండతో పాటు రానా దగ్గుబాటి, నటి మంచు లక్ష్మి వంటి వారికి కూడా ఈడీ నోటీసులు పంపింది. రానా దగ్గుబాటి ఇప్పటికే విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. సినిమా షూటింగ్‌లు ఉండడంతో విచారణకు మరికొంత సమయం కోరాడు.

# 'డేవిడ్ రెడ్డి'గా మంచు మనోజ్..

## ఆసక్తికరంగా మూవీ పోస్టర్




విలక్షణ నటుడు మంచు మనోజ్ చాలా కాలం తర్వాత ఒక భారీ చారిత్రక యాక్షన్ డ్రామాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తన 21వ చిత్రంగా 'డేవిడ్ రెడ్డి' అనే టైటిల్‌ను ప్రకటించారు. సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 21 ఏళ్లు పూర్తయిన ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన ఈ కొత్త ప్రాజెక్ట్‌ను వెల్లడించారు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేయగా, అది ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమా 1897 నుంచి 1922 మధ్య కాలంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం నేపథ్యంలో సాగుతుందని చిత్రబృందం తెలిపింది. కుల వివక్ష నుంచి పుట్టి, బ్రిటిష్ సామ్రాజ్యాన్నే గడగడలాడించిన ఒక సామాన్య యోధుడి సాహసగాథగా 'డేవిడ్ రెడ్డి'ని తెరకెక్కించనున్నారు. "మద్రాస్ ప్రెసిడెన్సీలో పుట్టి, ఢిల్లీలో పెరిగి, ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కదిలిస్తున్నాడు" అనే ట్యాగ్‌లైన్ సినిమా కథాంశంపై అంచనాలను పెంచుతోంది. ఇందులో మనోజ్ మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. హనుమ రెడ్డి యక్కంటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, మోటూకూరి భరత్, నల్లగంగుల వెంకట్ రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దుతున్నామని దర్శకనిర్మాతలు తెలిపారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ సోషల్ మీడియాలో తన ఆనందాన్ని పంచుకున్నారు. "సినిమాల్లో నా 21 ఏళ్ల ప్రయాణం పూర్తయింది. నేను ప్రేమించే పనిని ఇంకా చేస్తున్నందుకు ఆశీర్వదించబడినట్లు భావిస్తున్నాను. అదే ప్రేమ, ఆశతో నా 21వ చిత్రం 'డేవిడ్ రెడ్డి'ని ప్రకటిస్తున్నాను. ఇది ఒక ఉద్వేగభరితమైన చారిత్రక యాక్షన్ డ్రామా. రాబోయే ప్రయాణం కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను" అని మనోజ్ పేర్కొన్నారు.

# పుష్ప-2 తొక్కిసలాటపై ఎన్‌హెచ్‌ఆర్సీ సీరియస్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ తొక్కిసలాటలో ఒక మహిళ మరణించగా, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయంపై అందిన ఫిర్యాదును పరిశీలించిన జాతీయ మానవ హక్కుల కమిషన్, సినిమా థియేటర్ వద్ద తగిన భద్రతా చర్యలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను సీరియస్‌గా పరిగణిస్తూ, మృతురాలి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించాలని అలాగే ఈ సంఘటనపై పూర్తి నివేదికను సమర్పించాలని తెలంగాణ పోలీసులను ఆదేశించింది. కాగా.. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు వెలువడాల్సి ఉంది.

# 'ఘాట్ లో ఘాటీలే ఉంటారు సార్'..

## పవర్ ఫుల్ గా ఘాటీ ట్రైలర్..



స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి.. ఇప్పుడు కెరీర్ లో మళ్ళీ స్పీడ్ పెంచింది. చివరగా మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి మూవీతో వచ్చి మంచి విజయాన్ని అందుకున్న అమ్మడు.. ఇప్పుడు ప్రతిష్టాత్మక మూవీ ఘాటీతో సందడి చేయనుంది. టాలీవుడ్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఆ సినిమా కూడా ఒకటన్న విషయం తెలిసిందే. విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. క్రైమ్ అండ్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఆ సినిమాను క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే అనుష్క, క్రిష్ కాంబోలో వచ్చిన వేదం మూవీ మెప్పించింది. ఇప్పుడు మరోసారి కాంబో రిపీట్ అవ్వడంతో అంతా భారీ అంచనాలు పెట్టుకున్నారు. అదే సమయంలో సినిమా నుంచి రిలీజ్ అయిన పోస్టర్స్, టీజర్ పాజిటివ్ బజ్ క్రియేట్ చేసి అంచనాలు పెంచాయి. తాజాగా మూవీ ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. విడుదల తేదీపై కూడా క్లారిటీ ఇచ్చారు. సెప్టెంబర్ 5వ తేదీన సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు. థియేటర్లలో చిత్రం ప్రేక్షకులను అలరించనుందని మేకర్స్ హామీ ఇస్తున్నారు. అదే సమయంలో ట్రైలర్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సినీ ప్రియులను ఆకట్టుకుని దూసుకుపోతోంది. ట్రెండింగ్ లో కూడా నిలిచింది. ఘాట్లకు చెందిన వ్యక్తిగా అనుష్కను పరిచయం చేశారు మేకర్స్. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుంటుంది. ఆమె పార్ట్ టైమ్‌లో బస్ కండక్టర్ గా పని చేస్తుంటుంది. ఆ టిపికల్ జాబ్ లో కూడా స్ట్రాంగ్ గా వర్క్ చేస్తుంటుంది. విక్రమ్ ప్రభు ఆమె ప్రేమికుడిగా, విప్లవకారుడిగా కనిపిస్తాడు. చైతన్య రావు, జాన్ విజయ్, రవీంద్ర విజయ్ విరోధులుగా.. జగపతి బాబు పోలీసు అధికారిగా కనిపిస్తారు. సినిమాలో అనుష్క నేరస్థురాలిగా మారిన ఓ బాధితురాలిగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఆమె చేతి పైన ఓ విచిత్రమైన టాటూ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ఓవరాల్ గా అనుష్కను ఫుల్ వైలెంట్ గా చూపించారు మేకర్స్.

# నిజంగా అందాల రాశి



ఊహలు గుసగుసలాడే సినిమాతో హీరోయిన్‌గా 2014లో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన రాశి ఖన్నా మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు దక్కించుకుంది. అంతకు ముందు చేసిన సినిమాలు పెద్దగా బ్రేక్ తీసుకుని రాలేక పోయాయి, అంతే కాకుండా అవి ఏవీ హీరోయిన్ పాత్రలు కాకపోవడంతో రాశి ఖన్నా టాలీవుడ్‌లో ఊహలు గుసగులాడే సినిమా తర్వాత బిజీగా మారింది. బ్యాక్ టు బ్యాక్ రవితేజతో బెంగాల్ టైగర్, సాయి ధరమ్ తేజ్‌తో సుప్రీమ్, ఎన్టీఆర్ జై లవకుశ, వరుణ్ తేజ్ తో తొలి ప్రేమ ఇలా చాలా సినిమాల్లో నటించింది. ఎన్టీఆర్‌తో మినహా మరే స్టార్ హీరోతో రాశి ఖన్నా సినిమాలు చేసే అవకాశాలు దక్కించుకోలేదు. ఈ మధ్య కాలంలో టాలీవుడ్ నుంచి ఈమెకు ఆఫర్లు చాలా తక్కువగా వస్తున్నాయి. అయితే లక్కీగా బాలీవుడ్, కోలీవుడ్ నుంచి ఈమెకు వరుస ఆఫర్లు వస్తున్నాయి. అక్కడ మంచి విజయాలను సొంతం చేసుకోవడం ద్వారా రాశి ఖన్నా కెరీర్ మరింత స్పీడ్ అందుకున్నట్లు అయింది. వైట్ డ్రెస్‌లో అందాల రాశి సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలు, వీడియోలను రాశి ఖన్నా షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. రాశి అందమైన ఫోటోలు షేర్ చేసిన ప్రతిసారి వైరల్ కావడం జరుగుతుంది. మరోసారి అందాల రాశి తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఉన్న ఏ హీరోయిన్ ఫోటోలు షేర్ చేసినా వైరల్ అవ్వడం కామన్ విషయం. అలాంటిది రాశి ఖన్నా ఫోటోలు షేర్ చేస్తే వైరల్ కాకుండా ఉంటుందా.. అందాల రాశి ఖన్నా ఆకట్టుకునే అందంతో మరోసారి సర్‌ప్రైజ్ చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ రాశి ఖన్నా సొంతం అంటూ ఈ ఫోటోలకు చాలా మంది నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. వైట్ డ్రెస్ లో రాశి ఖన్నా మెరిసి పోతుందని, పేరుకు తగ్గట్లుగా ఈమె అందాల రాశి అనడంలో ఏమాత్రం డౌట్ లేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.